విలేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాప్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759

RNI:APTEL/2023/87729

పెన్ సత్తా


ప్రశ్నించడం అందిరి హక్కు..

PEN SATTA Telugu Daily



సంపుటి : 4 | సంచిక :182 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | మంగళవారం 17 నవంబర్ 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool



యాక్ట్ ఈస్ట్ పాలసీకి ప్రాధాన్యం

- ఆసియాన్ సదస్సులో పాల్గొనేందుకు మనీలాకు ప్రధాని మోదీ
- భారత్-ఆసియాన్ సంబంధాల బలోపేతమే లక్ష్యం..
- నేడు రెండు కీలక అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొననున్న మోదీ
- మనీలాలో ప్రధాని మోదీకు ఘన స్వాగతం

రామోజీరావు జయంతి ఇకపై రాష్ట్ర పండుగ

- అధికారికంగా నిర్వహిస్తాం.. సీఎం చంద్రబాబు ప్రకటన
- రామోజీ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానోత్సవంలో అమిత్ షా, పవన్ కల్యాణ్
- 9 మంది ప్రముఖులకు అవార్డుల ప్రదానం.. ఘనంగా 90వ జయంతి వేడుకలు



విజయవాడ

తెలుగు జాతి గర్వించదగ్గ మహనీయుడు, పద్మవిభూషణ్ స్వర్గీయ రామోజీరావు జయంతిని ఇకపై ప్రతి ఏటా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధికారికంగా రాష్ట్ర పండుగగా నిర్వహిస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. తెలుగు సమాజానికి, రాష్ట్రానికి ఆయన అందించిన విశేష సేవలను చిరస్మరణీయం చేయాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. రామోజీరావు 90వ జయంతి సందర్భంగా విజయవాడలోని బీఆర్ అంబేద్కర్ ఆడిటోరియంలో నిర్వహించిన 'రామోజీ ఎక్సలెన్స్ అవార్డ్స్--2026' ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, కె. రామ్మోహన్ నాయుడు, రామోజీ గ్రూప్ సంస్థల వివరాలు 2లో..

సమస్యల పరిష్కారంలో ఆయనకున్న దార్శనికత అద్భుతం



- హిందీ మాట్లాడని రామోజీరావు వద్ద అంత సమాచారం ఎలా ఉందో నాకు అర్థం కాలేదు: అమిత్ షా
- రామోజీరావు 90వ జయంతి సందర్భంగా ఘన నివాళు లర్పించిన అమిత్ షా
- వివిధ రంగాల్లో విశేష సేవలందించిన ప్రతిభావంతులకు రామోజీరావు ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానం
- ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా ప్రజాస్వామ్య నాలుగో స్తంభాన్ని కాపాడారని ప్రశంస

అమరావతి

మీడియా రంగంలో నైతిక విలువలతో కూడిన జర్నలిజానికి రామోజీరావు తిరుగులేని ప్రతీకగా నిలిచారని కేంద్ర హోంమంత్రి అమిత్ షా కొనియాడారు. ఆయన కేవలం ఒక వ్యక్తి మాత్రమే కాదని, తన జీవితకాలంలోనే సమాజానికి మార్గదర్శనం చేసే ఒక మహోన్నత వ్యవస్థగా ఎదిగారని ప్రశంసించారు. రామోజీ గ్రూప్ వ్యవస్థాపకులు రామోజీరావు 90వ జయంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన విశిష్ట కార్యక్రమంలో వివిధ రంగాల్లో నిష్ణాతులైన ప్రతిభావంతులకు 'రామోజీరావు ఎక్సలెన్స్ అవార్డుల'ను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, కింజరాపు రామ్మోహన్ నాయుడు, భూపతిరాజు శ్రీనివాస వర్మ, రామోజీ గ్రూప్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ కిరణ్ తదితరులు హాజరయ్యారు. సభనుద్దేశించి కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రసంగిస్తూ.. తొలుత తాను గొప్పదైన తెలుగు భాషలో - వివరాలు 2లో..



యుద్ధ వేళ విదేశాలపై ఆధారపడే పరిస్థితి ఉండకూడదు!

- స్వదేశీ ఆయుధాలే భారత రక్షణకు అసలైన బలం
- ఆత్మనిర్భరతే యుద్ధ సంసిద్ధతకు పునాది
- ఆపరేషన్ సిందూర్‌తో స్వదేశీ ఆయుధాల సత్తా నిరూపణ
- చైనా కదలికలపై నిరంతర నిఘా.. ఎలాంటి ముప్పునైనా ఎదుర్కొనేందుకు సిద్ధం

కుటుంబంపై ప్రచారమైన అసత్యాలకు నా ఆత్మకథే సమాధానం!

- మా కుటుంబంపై ఎన్నో అవాస్తవ కథనాలు అల్లారు!
- వాటికి సమాధానంగానే ఆత్మకథ రాశా: సోనియా గాంధీ
- 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకావిష్కరణ
- రాహుల్, ప్రియాంక సమక్షంలో ఘనంగా కార్యక్రమం



ఏపీలో రెండో విడత పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదల



- ఈ నెల 29న పోలింగ్.. అదే రోజు ఓట్ల లెక్కింపు
- 18 నుంచి 20 వరకు నామినేషన్ల స్వీకరణ
- 24న అభ్యర్థుల తుది జాబితా ప్రకటన
- మూడు దశల్లో 13,171 పంచాయతీలకు ఎన్నికలు
- స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో గ్రామాల వారీగా షెడ్యూల్ వివరాలు

అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లో రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. ఈ నెల 29న పోలింగ్ నిర్వహించనున్నట్లు ప్రకటించింది. నవంబర్ 18 నుంచి 20 వరకు నామినేషన్ల స్వీకరణ, 21న నామినేషన్ల పరిశీలన చేపట్టనున్నారు. నవంబర్ 24 మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం కల్పించారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటల తర్వాత పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను ప్రకటించనున్నారు. నవంబర్ 29న ఉదయం 7 గంటల నుంచి వివరాలు 2లో..



ఎస్ఐఆర్‌పై ఈసీని నిలదీసేందుకు అనుమతించండి!

- సుప్రీంకోర్టును ఆశ్రయించిన రాహుల్‌గాంధీ సహా విపక్ష నేతలు
- 48 ప్రశ్నలతో ప్రశ్నావళి సమర్పణ
- ఓటర్ల తొలగింపు, ఈసీ నిర్ణయాలపై వివరణ కోరిన నేతలు
- ఈ నెల 17న మరోసారి విచారణ

తిరుమలలో వైభవంగా శ్రీవారి పుష్పాల ఊరేగింపు



- పుష్పయాగానికి 9 టన్నుల పుష్పాలు సమర్పణ
- 16 రకాల పూలు.. 6 రకాల పత్రాలతో పుష్పార్చన
- 15వ శతాబ్దం నుంచి కొనసాగుతున్న సంప్రదాయం: టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర

తిరుమల

తిరుమల శ్రీవారి ఆలయంలో కార్తీక మాస శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని నిర్వహించే పుష్పయాగానికి అవసరమైన పుష్పాల ఊరేగింపు సోమవారం వైభవంగా జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు విరాళంగా అందించిన పుష్పాలను ప్రత్యేక పూజల అనంతరం మంగళవాయిద్యాలు, భక్తుల సందడి వివరాలు 2లో..



పాక్ చేతికి లక్ష ఎఫ్‌పీవీ డ్రోన్లు!

- తుర్కియేతో మూడేళ్ల భారీ ఒప్పందం..
- స్వదేశంలోనే తయారీ కేంద్రాల ఏర్పాటు
- ఆపరేషన్ సిందూర్ తర్వాత ఆయుధ సంపత్తి పెంపుపై పాక్ దృష్టి
- నిఘా నుంచి దాడుల వరకు.. యుద్ధరంగంలో డ్రోన్లదే కీలక పాత్ర



ఇంధన ధరల సెగ.. టోకు ద్రవ్యోల్బణం 12.29 శాతానికి!

వరుసగా మూడో నెలా పెరుగుదల.. ముడి చమురు, విద్యుత్ ధరల ప్రభావం


మినరల్ ఆయిల్స్‌లో 45.57 శాతం ద్రవ్యోల్బణం.. సామాన్యులపై ధరల భారం పడే అవకాశం

సమస్యల పరిష్కారంలో ఆయనకున్న దార్శనికత అద్భుతం

-మొదటిపేజీ తరువాయి

మాట్లాడలేకపోతున్నందుకు సభికులకు క్షమాపణలు తెలిపారు. అనంతరం రామోజీరావుతో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ తొలిసారి ప్రమాణస్వీకారం చేసిన సమయంలో తీవ్ర రద్దీ వల్ల తన వాహనం ముందుకుపోలేకపోయిందని.. ఆ సమయంలో చంద్రబాబు, రామోజీరావు కలసి తనను వారి కారులో ఎక్కించుకుని గుజరాత్ భవన్‌కు చేర్చారని, ఆ విధంగా రామోజీరావుతో తొలి పరిచయం ఏర్పడిందని వివరించారు. ఆ తర్వాత బీజేపీ అధ్యక్షుడిగా, కేంద్ర హోంమంత్రిగా నాలుగు సార్లు రామోజీ ఫిల్మ్ సిటీలో ఆయన్ను కలిసే అవకాశం లభించిందని తెలిపారు.

ఎక్కువగా ప్రయాణాలు చేయకపోయినా.. దేశంలో ఏ మారుమూల ఏం జరిగినా రామోజీరావు టేబుల్ వద్దకు పూర్తి సమాచారం ఉండేదని, అది చూసి తాను ఆశ్చర్యపోయానని అమిత్ షా అన్నారు. హిందీ మాట్లాడని రామోజీరావు వద్ద ఉత్తరప్రదేశ్ ఎన్నికల సమయంలో అంత సమాచారం ఉండడం తనకు విస్మయం కలిగించిందని చెప్పారు. ఆనాడు యూపీ ఎన్నికల్లో క్షేత్రస్థాయి పరిస్థితులపై స్పష్టమైన విశ్లేషణ ఇచ్చారని, ఫలితాలు కూడా సరిగ్గా ఆయన చెప్పినట్లే వచ్చాయని గుర్తుచేశారు. జమ్ముకశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు అనంతరం తాను ఆయన్ను కలిసినప్పుడు.. ఈశాన్య రాష్ట్రాల్లోని వేర్పాటువాదం, తీవ్రవాదంపై ఆయన ఇచ్చిన సలహాలు, చూపిన అవగాహన అమోఘమని పేర్కొన్నారు.



దేశ సమస్యల పరిష్కారానికి రామోజీరావు లాంటి వ్యక్తులను గౌరవ సలహాదారుగా తీసుకోవచ్చని తాను ఆ రోజే భావించినట్లు చెప్పారు.

కృష్ణా జిల్లాలోని ఒక సాధారణ రైతు కుటుంబంలో పుట్టి, ఎటువంటి వారసత్వం లేదా జర్నలిజం డిగ్రీ లేకపోయినా కేవలం సంకల్ప బలం, కఠిన శ్రమతో రామోజీరావు 'ఈనాడు'ను ప్రారంభించారని అమిత్ షా గుర్తుచేశారు. తెలుగు ప్రజలకు నిజాన్ని అందించడమే లక్ష్యంగా పనిచేసి గొప్ప విప్లవం సృష్టించారన్నారు. భారత జర్నలిజం రంగంలో రామోజీరావును కేవలం రామ్‌నాథ్ గోయెంకాతో మాత్రమే పోల్చగలమని వ్యాఖ్యానించారు. సాంకేతిక మార్పులకు అనుగుణంగా ప్రాంతీయ భాషల్లో 24 గంటల వార్తా చానళ్లను ప్రారంభించి 'ఈటీవీ' ద్వారా దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చారని తెలిపారు. అనారోగ్యంతో ఉన్న చివరి రోజుల్లో కూడా మొబైల్ మాధ్యమంలో వార్తలను అందించాలనే తపనతో ఆయన పనిచేశారని చెప్పారు.

కేంద్రంలో గానీ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గానీ అధికారంలో ఎవరున్నా.. ప్రభుత్వాల ఒత్తిళ్లకు లొంగకుండా తన మీడియా సంస్థల స్వాతంత్ర్యాన్ని రామోజీరావు కాపాడారని అమిత్ షా స్పష్టం చేశారు. ఎన్ని ఆర్థిక నష్టాలు, సవాళ్లు ఎదురైనా జర్నలిజం విలువలకు కట్టుబడి ప్రజాస్వామ్య నాలుగో స్తంభాన్ని నిలబెట్టారని కొనియాడారు. 2016లో ఆయనకు పద్మవిభూషణ్ లభించినప్పుడు అది రామోజీరావు ఒక్కరికే కాకుండా మొత్తం జర్నలిజం రంగానికి, తెలుగువారి ఆత్మగౌరవానికి దక్కిన గౌరవమని గుజరాతీ పత్రికలు రాశాయని గుర్తుచేశారు. రామోజీ ఫిల్మ్ సిటీ ద్వారా భారతీయ సినీ రంగానికి ఆయన చేసిన సేవలు అద్వితీయమని ప్రశంసించారు.

సైన్స్ అండ్ టెక్నాలజీ, యూత్ ఐకాన్, ప్రజాసేవ, కళలు-సంస్కృతి, విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి, జర్నలిజం, మహిళా సాధికారత తదితర 9 విభాగాల్లో ప్రతిభ చూపిన వారికి ఈ కార్యక్రమంలో అవార్డులను అందజేశారు. జీవితంలో ఎన్నో అవార్డులు రావచ్చని, కానీ రామోజీరావు పేరుతో ఇచ్చే పురస్కారాన్ని అందుకోవడం ఎంతో ప్రత్యేకమైన గౌరవమని అవార్డు గ్రహీతలకు అమిత్ షా అభినందనలు తెలిపారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం సంస్కరణలు, అభివృద్ధి బాటలో ముందుకు సాగుతోందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

రామోజీరావు జయంతి ఇకపై రాష్ట్ర పండుగ

-మొదటిపేజీ తరువాయి

సీఎండీ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రామోజీరావుతో 45 ఏళ్ల అనుబంధం

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. రామోజీరావుతో తనకు 1980 నుంచి సుమారు 45 ఏళ్లకు పైగా అనుబంధం ఉందని గుర్తుచేసుకున్నారు. తాను తొలిసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన సమయంలో రామోజీరావు చెప్పిన మాటలను ప్రస్తావించారు. ప్రభుత్వం నుంచి తనకు గానీ, తన సంస్థకు చెందిన వ్యక్తులకు గానీ ఎలాంటి ప్రత్యేక ప్రయోజనాలు కోరబోనని, అదే విధంగా ప్రభుత్వ వ్యవహారాల్లో తమ సంస్థ విషయంలో అనుకూలంగా వార్తలు రాయాలని లేదా ప్రతికూల వార్తలు రాయకూడదని తాను ఎప్పుడూ అడగకూడదని స్పష్టం చేశారని తెలిపారు. ప్రజలకు మంచి చేస్తే మద్దతుగా నిలుస్తానని, తప్పు చేస్తే విమర్శించడానికి వెనుకాడనని రామోజీరావు నిర్మొహమాటంగా చెప్పేవారని చంద్రబాబు గుర్తుచేశారు. విలువలకు కట్టుబడి పనిచేయడం ఆయన ప్రత్యేకత అని కొనియాడారు.

ఈనాడు విశ్వసనీయతకు నిదర్శనం

ఈనాడు పత్రిక విశ్వసనీయతను ప్రస్తావిస్తూ.. రాత్రి టీవీల్లో వార్తలు చూసినప్పటికీ, మరుసటి రోజు ఉదయం ఈనాడు పత్రికలో వచ్చిన సమాచారంతో వాటిని నిర్ధారించుకునే స్థాయిలో రామోజీరావు విశ్వసనీయతను సంపాదించారని చంద్రబాబు పేర్కొన్నారు. ఆధారాలు ఉంటే తనపై వచ్చిన వార్తలను కూడా ప్రచురించేందుకు జర్నలిస్టులకు స్వేచ్ఛనిచ్చిన వ్యక్తి అని ప్రశంసించారు. సాధారణ వ్యక్తులను గుర్తించి, వారిలోని ప్రతిభను వెలికితీసి అసాధారణ స్థాయికి తీసుకెళ్లిన మార్గదర్శకుడని అభివర్ణించారు.

అమరావతి పేరులోనూ రామోజీ ముద్ర

ఆంధ్రప్రదేశ్ రాజధానికి అమరావతి పేరు నిర్ణయించడంలో



రామోజీరావు చేసిన పరిశోధన, సూచనలు కీలకమని చంద్రబాబు గుర్తుచేశారు. అమరావతి పేరుకు ఉన్న చారిత్రక, శాస్త్రీయ ప్రాధాన్యాన్ని అధ్యయనం చేసి తనకు వివరించారని తెలిపారు. ఆ పేరు ప్రజల ఆమోదం పొందిందని పేర్కొన్నారు. అమరావతి నిర్మాణానికి రామోజీ గ్రూప్ తరఫున రూ.10 కోట్ల విరాళం అందించారని వెల్లడించారు. కరోనా సమయంలోనూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెరో రూ.10 కోట్ల చొప్పున సాయం చేశారని గుర్తుచేశారు.

విపత్తుల సమయంలో ప్రజలకు అండగా

లాతూర్ భూకంపం, సునామీ, హుద్‌హుద్ వంటి ప్రకృతి విపత్తుల సమయంలో బాధితులకు రామోజీరావు అండగా నిలిచారని చంద్రబాబు తెలిపారు. ప్రజల నుంచి సేకరించిన విరాళాలకు పూర్తి లెక్కలు చూపించడం ద్వారా పారదర్శకతకు ప్రాధాన్యం ఇచ్చారని కొనియాడారు. జీవిత చరమాంకంలో అనారోగ్యంతో బాధపడుతున్న సమయంలోనూ ఆయనను రాజకీయంగా ఇబ్బందులకు గురిచేసే ప్రయత్నాలు జరిగాయని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. అయినప్పటికీ తన సిద్ధాంతాల విషయంలో రాజీ పడకుండా నిలబడిన వ్యక్తి రామోజీరావు అని పేర్కొన్నారు. ఆయన తెలుగు జాతికి ఒక గొప్ప ఆస్తి అని, యువతకు ఆయన జీవితం ఆదర్శమని అన్నారు.

9 మంది ప్రముఖులకు ఎక్సలెన్స్ అవార్డులు

జర్నలిజం, కళలు--సంస్కృతి, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, మహిళా సాధికారత, సైన్స్ అండ్ టెక్నాలజీ, సామాజిక సేవ, యూత్ ఐకాన్, విద్య--వైద్యం తదితర రంగాల్లో విశేష సేవలు అందించిన తొమ్మిది మంది ప్రముఖులకు రామోజీ ఎక్సలెన్స్ అవార్డులను ప్రదానం చేశారు. ఆయా రంగాల్లో ప్రతిభ కనబరిచి సమాజానికి సేవలందించిన వారిని ఈ అవార్డుల ద్వారా గౌరవించారు. అవార్డు గ్రహీతలకు, రామోజీ గ్రూప్ సీఎండీ కిరణ్‌కు, వారి కుటుంబ సభ్యులకు చంద్రబాబు అభినందనలు తెలిపారు.

రామోజీ విలువలను ముందుకు తీసుకెళ్లాలి

రామోజీరావు తమ కుటుంబానికి ఆస్తులతో పాటు సమాజ హితం కోసం నిలబడాల్సిన గొప్ప బాధ్యతను కూడా అందించారని చంద్రబాబు పేర్కొన్నారు. ఆయన ఆశయాలు, విలువలను భవిష్యత్తు తరాలకు అందించాలని రామోజీ కుటుంబ సభ్యులకు సూచించారు. తెలుగు భాష, సంస్కృతి, మీడియా, పారిశ్రామిక రంగాలతో పాటు సమాజంలోని అనేక రంగాలకు రామోజీరావు చేసిన సేవలను స్మరించుకుంటూ ఆయన జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించాలనే నిర్ణయం తీసుకున్నట్లు సీఎం ప్రకటించారు.

ఘనంగా ప్రముఖుల హాజరు

రామోజీరావు 90వ జయంతి సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, రామ్మోహన్ నాయుడు, రామోజీ గ్రూప్ సీఎండీ కిరణ్ తదితరులు రామోజీరావుకు నివాళులర్పించారు. అవార్డుల ప్రదానం, ప్రముఖుల ప్రసంగాలతో కార్యక్రమం ఘనంగా జరిగింది.

ర్యాలీల హోరు.. నామినేషన్ల జోరు!

తాడేపల్లి: ఆంధ్రప్రదేశ్‌లో రెండో విడత పురపోరుకు నామినేషన్ల పర్వం ముగిసింది. చివరి రోజైన సోమవారం అభ్యర్థులు పెద్ద సంఖ్యలో నామపత్రాలు దాఖలు చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి భారీ ర్యాలీలుగా నామినేషన్ కేంద్రాలకు చేరుకుని తమ బలాన్ని చాటుకునే ప్రయత్నం చేశారు. వివిధ మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో అభ్యర్థుల ర్యాలీలతో సందడి వాతావరణం నెలకొంది.

తాడేపల్లి మేయర్ అభ్యర్థిగా ఏడుకొండలు

మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్ మేయర్ అభ్యర్థిగా కూటమి తరఫున తెలుగుదేశం నేత పేరం ఏడుకొండలు నామినేషన్ దాఖలు చేశారు. పల్నాడు జిల్లా నరసరావుపేట మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థిగా టీడీపీ నుంచి నాగసరపు రూపేష్ గుప్తా నామపత్రం సమర్పించగా, వైఎస్సార్‌సీపీ తరఫున షేక్ ఖాజావలి బరిలో నిలిచారు. విజయనగరం జిల్లా రాజాం మున్సిపల్ ఛైర్‌పర్సన్ అభ్యర్థిగా జనసేన తరఫున బనిశెట్టి సౌజన్యలత నామినేషన్ వేశారు. కృష్ణా జిల్లా గుడివాడ మున్సిపాలిటీలో చివరి రోజు పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యాయి. టీడీపీ ఛైర్‌పర్సన్ అభ్యర్థి మరిదు కరుణ ర్యాలీగా వెళ్లి నామపత్రాలు సమర్పించారు. మరోవైపు, అనుమతులు లేవంటూ వైఎస్సార్‌సీపీ ఛైర్‌పర్సన్ అభ్యర్థి మెరుగుమాల ప్రవీణ ర్యాలీని పోలీసులు అడ్డుకుని, మరో మార్గంలో వెళ్లాలని సూచించారు.

భారీ ర్యాలీలతో అభ్యర్థుల సందడి

గుంటూరు జిల్లా పొన్నూరు మున్సిపాలిటీ ఎన్నికల్లో టీడీపీ, వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు భారీ ర్యాలీలతో వచ్చి నామినేషన్లు




దాఖలు చేశారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకు మున్సిపల్ ఛైర్‌పర్సన్ స్థానానికి టీడీపీ తరఫున బసవ వీరవెంకట సత్యరామకృష్ణారావు, వైఎస్సార్‌సీపీ నుంచి ఇందుగపల్లి బలరామకృష్ణ, కాంగ్రెస్ తరఫున కడలి రామారావు నామపత్రాలు సమర్పించారు. శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్ అభ్యర్థిగా టీడీపీ తరఫున ఎమ్మెల్యే కూన రవికుమార్ సతీమణి ప్రమీల నామినేషన్ దాఖలు చేశారు. వైఎస్సార్‌సీపీ తరఫున బొడ్డేపల్లి అజంతా కుమారి నామపత్రం సమర్పించారు.

బ్యాలెట్ పత్రంలో నోటా గుర్తు

స్థానిక సంస్థల ఎన్నికల్లో గుర్తుల కేటాయింపుపై రాష్ట్ర ఎన్నికల సంఘం ఇటీవల నోటిఫికేషన్ జారీ చేసింది. రాష్ట్రంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు, ఇతర రాష్ట్రాల్లో గుర్తింపు పొందిన పార్టీలు, రిజిస్టరైన పార్టీలకు ఎన్నికల గుర్తుల కేటాయింపునకు సంబంధించి మార్గదర్శకాలను ప్రకటించింది. మేయర్, వార్డు సభ్యుల ఎన్నికల్లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు గతంలో కేటాయించిన గుర్తులే అమలులో ఉంటాయని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది.

ఏపీలో రెండో విడత పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదల



-మొదటిపేజీ తరువాయి

మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను వెల్లడించనున్నారు. అవసరమైన ప్రాంతాల్లో నవంబర్ 30న రీపోలింగ్ నిర్వహించనున్నట్లు ఎన్నికల సంఘం తెలిపింది.

రెండో విడత ఎన్నికల షెడ్యూల్

నవంబర్ 18--20: నామినేషన్ల స్వీకరణ
నవంబర్ 21: నామినేషన్ల పరిశీలన
నవంబర్ 22: తిరస్కరించిన నామినేషన్లపై సాయంత్రం 5 గంటల వరకు అప్పీళ్లకు అవకాశం
నవంబర్ 23: అప్పీళ్ల పరిష్కారం
నవంబర్ 24: మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ
నవంబర్ 24: మధ్యాహ్నం 3 గంటల తర్వాత తుది అభ్యర్థుల జాబితా
నవంబర్ 29: ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్
నవంబర్ 29: మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు
నవంబర్ 30: అవసరమైన చోట్ల రీపోలింగ్, అనంతరం ఫలితాల ప్రకటన

మూడు దశల్లో పంచాయతీ ఎన్నికలు



రాష్ట్రవ్యాప్తంగా 13,171 గ్రామ పంచాయతీలకు మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తోంది. ఈ నెల 26, 29, డిసెంబర్ 2 తేదీల్లో పోలింగ్ జరగనుంది. ఇప్పటికే తొలి విడత ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నెల 17వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ కొనసాగనుంది. 21వ తేదీ నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు. తొలి విడత పోలింగ్ ఈ నెల 26న జరగనుండగా, అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. రీపోలింగ్ అవసరమైతే 27న నిర్వహించనున్నారు.

మొబైల్‌లోనే ఎన్నికల షెడ్యూల్ వివరాలు

గ్రామ పంచాయతీ ఎన్నికలు ఏ గ్రామంలో, ఏ తేదీన జరుగుతాయో తెలుసుకునేందుకు స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో ప్రత్యేక సదుపాయం అందుబాటులోకి తెచ్చారు. స్వర్ణ పంచాయతీ పోర్టల్ ద్వారా ఓటర్లు తమ గ్రామ ఎన్నికల షెడ్యూల్‌ను తెలుసుకోవచ్చు. వెబ్‌సైట్‌లో జిల్లా, మండలం, గ్రామ పంచాయతీ వివరాలను ఎంపిక చేసి సెర్చ్ చేస్తే సంబంధిత ఎన్నికల తేదీలు కనిపిస్తాయి. ఆస్తి పన్ను, ఇతర రుసుముల చెల్లింపుల కోసం అందుబాటులో ఉన్న ఈ పోర్టల్ ద్వారా ఎన్నికల సమాచారాన్ని కూడా సులభంగా పొందేలా ఏర్పాట్లు చేశారు.

తిరుమలలో వైభవంగా శ్రీవారి పుష్పాల ఊరేగింపు

-మొదటిపేజీ తరువాయి

మధ్య శ్రీవారి ఆలయానికి ఊరేగింపుగా తీసుకువచ్చారు.

ప్రత్యేక పూజల అనంతరం పుష్పాల ఊరేగింపు

తిరుమలలోని కల్యాణవేదిక వద్ద ఉన్న ఉద్యానవన విభాగంలో ముందుగా పుష్పాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం టీటీడీ సాధికార మండలి చైర్మన్, ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి, శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో భాస్కర్, ఉద్యానవన విభాగం డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, ఉద్యానవన సిబ్బంది, శ్రీవారి సేవకులు కలిసి పుష్పాలను ఊరేగింపుగా ఆలయం వరకు తీసుకెళ్లారు.

దోష నివారణ కోసం పుష్పయాగం

ఈ సందర్భంగా టీటీడీ చైర్మన్, ఈవో ముద్దాడ రవిచంద్ర మాట్లాడుతూ.. శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల సమయంలో తెలిసీ తెలియక జరిగిన దోషాల నివారణార్థం పుష్పయాగం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. బ్రహ్మోత్సవాల అనంతరం కార్తీక మాసంలో శ్రీవారి జన్మనక్షత్రమైన శ్రవణ నక్షత్రం రోజున ఈ మహోత్సవాన్ని నిర్వహిస్తారని వివరించారు. లోకకల్యాణం కోసం 15వ శతాబ్దం నుంచే పుష్పయాగం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మధ్యలో నిలిచిపోయిన ఈ ఉత్సవాన్ని టీటీడీ 1980 నుంచి తిరిగి పునరుద్ధరించి నిర్వహిస్తోందని వెల్లడించారు.

ఉదయం స్నపన తిరుమంజనం.. మధ్యాహ్నం పుష్పయాగం

పుష్పయాగానికి ఆదివారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించినట్లు ఈవో తెలిపారు. సోమవారం ఉదయం 9 నుంచి 11 గంటల మధ్య శ్రీవారి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామివారికి స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించినట్లు చెప్పారు. అనంతరం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్వామివారు, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు పుష్పయాగం నిర్వహించనున్నట్లు వివరించారు.

9 టన్నుల పుష్పాలు.. 16 రకాల పూలు

పుష్పయాగం కోసం మొత్తం 9 టన్నుల పుష్పాలను దాతలు విరాళంగా అందించినట్లు టీటీడీ ఈవో వెల్లడించారు. ఇందులో తమిళనాడు నుంచి 5 టన్నులు, కర్ణాటక నుంచి 2 టన్నులు, ఆంధ్రప్రదేశ్ నుంచి 2 టన్నుల పుష్పాలు ఉన్నాయని తెలిపారు. పుష్పయాగంలో 16 రకాల పుష్పాలతో పాటు 6 రకాల పత్రాలను వినియోగించనున్నట్లు పేర్కొన్నారు.

భక్తుల విరాళాలతో పుష్పయాగం

శ్రీవారి పుష్పయాగానికి వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు పుష్పాలను విరాళంగా అందించడం విశేషం. భక్తుల భక్తిశ్రద్ధలు, దాతల సహకారంతో ఈ మహోత్సవానికి అవసరమైన పుష్పాలు సమకూరాయి. శాస్త్రోక్తంగా నిర్వహించే పుష్పయాగంలో వివిధ రకాల పూలతో స్వామివారికి పుష్పార్చన చేయడం ఈ వేడుకలో ప్రధాన ఘట్టం.

గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహణ పై శిక్షణా తరగతులు.





శిక్షణలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్.

అనకాపల్లి, పెన్ సత్తా, సెప్టెంబర్ 16: సోమవారం ఉదయం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సమావేశ మందిరం శంకరం గ్రామ పంచాయతీ లో రెండవ సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎన్నికల సిబ్బందికి, అధికారులకు రెండు దినములు శిక్షణా తరగతుల కార్యక్రమం ఏర్పాటు చేసి అనంతరము ముగింపు కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో ఈ శిక్షణా తరగతులు నిర్వహించడం జరిగిందని, అనంతరము ఎన్నికల ప్రక్రియ పకడ్బందీగా చేపట్టబడుతోంది అని ఎన్నికల నిబంధనలు, పోలింగ్ సరళి, రిటర్నింగ్ అధికారుల విధులకు సంబంధించి ఈ శిక్షణలో సమగ్ర అవగాహన ఎంతో దోహదపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డి.పి.ఓ.కిరణ్ కుమార్, జెడ్పి సి.ఇ.ఓ. రాజ్ కుమార్, పి.డి. డ్వామా నిర్మలాదేవి, స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు ఏడి సత్యనారాయణ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో గ్రామ పంచాయతీ రెండో విడత ఎన్నికల షెడ్యూల్ విడుదల.



జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి విజయ కృష్ణన్.

అనకాపల్లి, పెన్ సత్తా, నవంబర్ 16: అనకాపల్లి జిల్లాలో గ్రామ పంచాయతీ సాధారణ ఎన్నికలు – 2026 రెండో విడత (ఫేజ్-××) ఎన్నికల షెడ్యూల్‌ను సోమవారం ఉదయం విడుదల చేసినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి విజయ కృష్ణన్, తెలిపారు. ఈ మేరకు నోటిఫికేషన్ నెం. 1800/ఎస్ఈసి-బి 2/2026 జారీ అయిందన్నారు. జిల్లాలో రెండవ విడతలో అనకాపల్లి రెవిన్యూ డివిజన్ కు సంబంధించి మునగపాక మండలం, అడ్డ రోడ్డు రెవెన్యూ డివిజన్ కు సంబంధించి కోటవురట్ల, నక్కపల్లి , పాయకరావుపేట, ఎస్ రాయవరం, అచ్యుతాపురం, రాంబిల్లి మరియు ఎలమంచిలి మండలాల్లో గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహించడం జరుగుతుందన్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పంచాయతీ రాజ్ చట్టం 2006 ప్రకారం ఎన్నికల నిర్వహణకు సంబంధించి రూల్స్ లోని 6 నియమం కింద ఎన్నికల నోటీసు జారీ, గ్రామ పంచాయితీ ఎన్నికల నిర్వహణ పై ఎన్నికల అధికారి జారీ చేసిన రూల్ 5 ప్రకారము వార్డు వారీ ఓటర్ల జాబితా ప్రదర్శన నవంబర్ 18, 2026 (ఉదయం 10:30 నుండి సాయంత్రం 5:00 వరకు).

నామినేషన్ల స్వీకరణకు చివరి తేదీ నవంబర్ 20, 2026 (సాయంత్రం 5:00 వరకు). నామినేషన్ల పరిశీలన నవంబర్ 21, 2026 (ఉదయం 8:00 నుండి).

నామినేషన్ల తిరస్కృతి పై అప్పీల్ దాఖలుకు అవకాశం (రెవెన్యూ డివిజనల్ అధికారి పరిశీలన) నవంబర్ 22, 2026 (సాయంత్రం 5:00 వరకు).

అప్పీల్స్ దాఖలు చేయడానికి చివరి తేదీ నవంబర్ 23, 2026.


నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ నవంబర్ 24, 2026 (సాయంత్రం 3:00 వరకు). అభ్యర్థుల తుది జాబితా ప్రచురణ నవంబర్ 24, 2026 (సాయంత్రం 3:00 తర్వాత). పోలింగ్ నవంబర్ 29, 2026 (ఉదయం 7:00 నుండి మధ్యాహ్నం 1:00 వరకు).

ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన: నవంబర్ 29, 2026 (మధ్యాహ్నం 2:00 నుండి లెక్కింపు పూర్తయిన వెంటనే ఫలితాల ప్రకటన).

ఫలితాలు ప్రకటించిన రోజే ఉపసర్పంచ్ ఎన్నిక నిర్వహించ బడుతుంది. ఎక్కడైనా రీపోలింగ్ అవసర మైనచో 30-11-2026 ఉదయం 7-00 గంటల నుంచి మధ్యాహ్నం 1-00 వరకు నిర్వహించడం జరుగుతుందని, మధ్యాహ్నం 2-00 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేసి, కోట్ల లెక్కింపు పూర్తి అయిన తదుపరి ఫలితం ప్రకటించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు.

అభ్యర్థులు, ఓటర్లు అందరూ ఈ ముఖ్య మైన తేదీలు, సమయాలను గమనించి ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి విజయ కృష్ణన్ కోరారు.

మేయర్ ని సత్కరించిన తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం.



గుంటూరు, పెన్ సత్తా, నవంబర్ 16:నవంబర్ 1 వ తేదీన గుంటూరు కార్పొరేషన్ కి జరిగిన మేయర్ ఎన్నికలలో అత్యధిక మెజారిటి తో ఘన విజయం సాధించిన కోవెలమూడి లక్ష్మి అపర్ణ ని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం గుంటూరు జిల్లా కమిటీ సభ్యులు మేయర్ అభ్యర్థి కార్యాలయంలో కలిసి డైరీ, శాలువా, బోకె తో ఘనంగా సత్కరించి, అభినందనలు తెలియ జేశారు. అనంతరం వారితో కార్పొరేషన్ లోని ఉపాధ్యాయుల పిఎఫ్ సమస్య లను వారి దృష్టి కి తీసుకొని వెళ్లగా, వెంటనే ఆమె స్పందించి తాను పదవీ భాధ్యతలు చేపట్టిన వెంటనే ఈ సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చినారు. ఈ కార్యక్రమం లో టి.ఎన్.యు.ఎస్ రాష్ట్ర కార్యదర్సులు ఎన్. వి. జగదీష్ కుమార్, కే. జయరాజు, జిల్లా అధ్యక్షులు పసల బాలస్వామి, గౌరవ సలహాదారులు కే. ఫణిదత్తు, సహాధ్యక్షులు జి వి శ్రీధర్, ఈస్ట్ ఇంచార్జి బాలాజీ నాయక్, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

భారీ ర్యాలీ తో పరవాడ సర్పంచ్ అభ్యర్థిగా చుక్క లక్ష్మి నామినేషన్.

పరవాడ గ్రామంలోని 14 వార్డులకు వార్డు సభ్యుల అభ్యర్థుల నామినేషన్లు.

పరవాడ, పెన్ సత్తా, నవంబర్ 16: గ్రామ పంచాయతీ అభివృద్ధే లక్ష్యంగా, ప్రజాసేవే ధ్యేయంగా సర్పంచ్ అభ్యర్థిగా చుక్క లక్ష్మి సోమవారం భారీ ర్యాలీతో పంచాయతీ కార్యాలయానికి చేరుకొని నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. గ్రామం నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలతో కలిసి భారీ ర్యాలీగా నామినేషన్ కేంద్రానికి చేరుకుని ఎన్నికల రిటర్నింగ్ అధికారికి తన నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ నామినేషన్ ను సర్పంచ్ అభ్యర్థిని చుక్క రాము నాయుడు ప్రతిపాదించారు. ఈ సందర్భంగా చుక్క లక్ష్మి మాట్లాడుతూ గ్రామ ప్రజల ఆశీస్సులు, సహకారంతో సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయడం సంతోషంగా ఉందన్నారు. తన పై నమ్మకంతో ఆదరిస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ అభివృద్ధికి పెద్దపీట వేస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. గ్రామంలో తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాలు, రహదారులు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పయిల శ్రీనివాసరావు, పరవాడ మాజీ ఎంపీపీ పయిల వెంకట పద్మ లక్ష్మి మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాలని, ప్రజల సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని తెలిపారు. అదే విధంగా పరవాడ గ్రామ పంచాయతీ లోని 14 వార్డులకు సంబంధించి వార్డు సభ్యుల అభ్యర్థులు సైతం సోమవారం తమ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. సర్పంచ్ అభ్యర్థితో పాటు 14 వార్డుల అభ్యర్థులు నామినేషన్లు సమర్పించారు. ఈ కార్యక్రమంలో పరవాడ మాజీ సర్పంచ్ పయిల అప్పారావు, వై.సి.పి నాయకులు పయిల రామచంద్ర రావు, పయిల గోపాల కృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి పయిల రాధ కృష్ణ, పయిల అప్పారావు, పయిల వెంకట రావు, పయిల పైడం నాయుడు, చుక్క రవి కుమార్, చీపురుపల్లి శ్రీనివాసరావు, పోతల అప్పలనాయుడు, గండి ఈశ్వరరావు, పయిల సన్యాసి నాయుడు, పయిల అప్పల నాయుడు, గండి వాసు, లాలం ముత్యాల నాయుడు, చుక్క వాసు, గేదెల అప్పారావు, పయిల సతీష్, బోండా శ్రీను, రొంగలి శ్రీను, బండారు శ్రీను, వై.సి.పి ముఖ్య నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



అంబాపురం, నిడమానూరులో కూటమి అభ్యర్థుల నామినేషన్ల జోరు.

- అంబాపురం సర్పంచ్ అభ్యర్థిగా మండల అరుణ నామినేషన్.
- నిడమానూరు సర్పంచ్ అభ్యర్థిగా బండి వెంకట్రావు (నాని) నామినేషన్.





విజయవాడ, పెన్ సత్తా, నవంబర్ 16: రూరల్ మండలం లోని అంబాపురం, నిడమానూరు గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కూటమి బలపరిచిన తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు సర్పంచ్ పదవులకు నామినేషన్లు దాఖలు చేశారు. అంబాపురం సర్పంచ్ అభ్యర్థిగా మండల అరుణ, నిడమానూరు సర్పంచ్ అభ్యర్థిగా బండి వెంకట్రావు (నాని) నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారులకు అందజేశారు. అంబాపురంలో నామినేషన్ కార్యక్రమంలో భాగంగా పాముల కాలువ నుంచి గ్రామ పంచాయతీ కార్యాలయం వరకు నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పాల్గొన్నారు. నిడమానూరులో బండి వెంకట్రావుతో పాటు గ్రామం లోని 16 వార్డులకు పోటీ చేస్తున్న అభ్యర్థులు కూడా నామినేషన్లు సమర్పించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ వెంకట్రావు అభ్యర్థులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థుల గెలుపునకు కూటమి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని, సమిష్టి కృషితో విజయం సాధించాలని సూచించారు.

అమిత్ షా కు స్వాగతం పలికిన యార్లగడ్డ.



గన్నవరం, పెన్ సత్తా, నవంబర్ 16:రామోజీ గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండో రామోజీ ఎక్సలెన్స్ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా కు ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తో పాటు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు అనిత, పయ్యావుల కేశవ్, కొల్లు రవీంద్ర, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, బిజెపి నేత మాధవ్, కృష్ణా జిల్లా కలెక్టర్, ఎస్పీ తదితర ప్రముఖులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన విమానాశ్రయం నుంచి రోడ్డు మార్గంలో విజయవాడ బయలుదేరి వెళ్లారు.

కార్తీక్ మాసం మొదట సోమవారం భక్తి శ్రద్ధలతో పూజలు.



అనకాపల్లి, పెన్ సత్తా, నవంబర్ 16:బెస్ట్ ఫ్రెండ్స్ క్లబ్ అనకాపల్లి వారి ఆధ్వర్యంలో కార్తీక్ మాసం మొదట సోమవారం సందర్భంగా కోటవీధిలో వెలిసిన బోగలింగేశ్వర సమేత సర్వకామంద అమ్మవారి దేవస్థానంలో భక్తులకు ప్రసాదాన్ని ఆలయ చైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్బు గౌరవ అధ్యక్షులు పెంటకోట నర్సింగ రావు, చైర్మన్ పిఎస్ అప్పారావు, అధ్యక్షులు బిఎస్ఎంకే జోగినాయుడు, కోశాధికారి భర్కికాన శ్రీనివాస రావు, బుద్ధ శివ, కర్రి మల్లేశ్వర రావు, పీలా రామకృష్ణ, బీమరశెట్టి శ్రీనివాస రావు, బొడ్డేడ రాజేష్, క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో పోటెత్తిన శివాలయాలు

- శివనామస్మరణలతో మారుమోగిన శైవ దేవాలయాలు





నక్కపల్లి, పెన్ సత్తా, నవంబర్ 16: మండలంలో పలు గ్రామాల్లో ఉన్న శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. పరమేశ్వరునికి ప్రీతికరమైన కార్తీకమాసం సోమవారం కావడంతో ఉపమాక, చినదొడ్డిగల్లు, గొడిచర్ల తదితర గ్రామాల్లో ఉన్న శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజాము నుండి సమీప గ్రామాల నుండి అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు అర్చనలు నిర్వహించారు. ధ్వజ స్తంభాల వద్ద మహిళలు కార్తీక దీపాలు వెలిగించి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వహకులు ఆలయాల్లో క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఉపమాక శివాలయం వద్ద నక్కపల్లి కి చెందిన శివ మాల ధారణ స్వాములు భక్తులకు పులిహోర ప్రసాదం పంపిణీ చేశారు. మధ్యాహ్నం ఆలయం వద్ద గ్రామస్తుల సహకారంతో పెద్ద ఎత్తున అన్న సమారాధన ఏర్పాటు చేశారు.ఉపమాక వెంకటేశ్వర స్వామి ఆలయంలో కూడా పెద్ద ఎత్తున మహిళలు స్వామివారిని దర్శించుకుని కార్తీకదీపం వెలిగించారు.

రేగాటిపల్లి సర్పంచ్ బరిలో ఇద్దరు వైసీపీ మహిళా అభ్యర్థులు!

లక్ష్మీదేవి,సావిత్రమ్మ నామినేషన్ల దాఖలు.. గ్రామంలో ఆసక్తికరంగా మారిన ఎన్నికల పోటీ



ధర్మవరం,నవంబర్ 16 (పెన్ సత్తా) శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం మండల గ్రామీణ పరిధిలోని రేగాటిపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నిక ఆసక్తికరంగా మారింది.సర్పంచ్ పదవికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇద్దరు మహిళా అభ్యర్థులు లక్ష్మీదేవి, సావిత్రమ్మ నామినేషన్లు దాఖలు చేశారు.దీంతో గ్రామంలో రాజకీయ చర్చ మొదలైంది.

రేగాటి పల్లి వైసీపీ నాయకుడు సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో లక్ష్మీదేవి సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయగా,మరో వైసీపీ అభ్యర్థి సావిత్రమ్మ కూడా సర్పంచ్ పదవికి నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారులకు సమర్పించారు.

ఒకే పార్టీకి చెందిన ఇద్దరు మహిళా అభ్యర్థులు సర్పంచ్ బరిలో నిలవడంతో రేగాటిపల్లి గ్రామంలో ఎన్నికల పోటీపై ఆసక్తి నెలకొంది.నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ అనంతరం తుది పోటీపై స్పష్టత రానుంది.

విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ పుస్తకాలు ఉచితంగా పంపిణీ

యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి

రామగిరి,నవంబర్ 16 (పెన్ సత్తా)రామగిరి మండల యూటీఎఫ్ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని కుంటిమద్ది ఉన్నత పాఠశాలలో ఎన్ఎంఎంఎస్ (జాతీయ ఉపకార వేతన అర్హత పరీక్ష) రాయనున్న విద్యార్థినీ విద్యార్థులకు సోమవారం ఉచితంగా పరీక్షా సన్నద్ధత పుస్తకాలను పంపిణీ చేశారు.

జన విజ్ఞాన వేదిక (జేవీవీ),ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) సంయుక్తంగా రూపొందించిన ఎన్ఎంఎంఎస్ పుస్తకాలను యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి, రామగిరి మండల అధ్యక్షుడు బాలగొండ శివయ్య,మండల నాయకులు ఆర్. గోపాల్‌రెడ్డి,గడ్డం రామ్మోహన్,ఎం.వి. వెంకట శివారెడ్డి,ఎస్. శివారెడ్డి తదితరులు విద్యార్థులకు అందజేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ పరీక్షలో అర్హత సాధిస్తే కేంద్ర ప్రభుత్వం నాలుగు సంవత్సరాల పాటు ప్రతి ఏటా రూ.12 వేల చొప్పున ఉపకార వేతనం అందజేస్తుందని తెలిపారు.ఆర్థికంగా వెనుకబడిన ప్రతిభావంతులైన విద్యార్థులకు ఈ ఉపకార వేతనం ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.విద్యార్థులకు పరీక్షల సన్నద్ధతలో ఉపయోగపడేలా జేవీవీ, యూటీఎఫ్ సంయుక్తంగా రూపొందించిన ఈ పుస్తకాలను మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఎన్ఎంఎంఎస్ పరీక్షలో మంచి ప్రతిభ కనబరిచి ఉపకార వేతనాలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు.



ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు, కుంటిమద్ది ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం,విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ వేదిక పై టెక్కలి క్రీడాకారుల గిన్నిస్ వరల్డ్ రికార్డు.



- టెక్కలి క్రీడాకారులకు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ గుర్తింపులి
- క్రీడాకారులను, కోచ్ ను అభినందించిన మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు.

కోటబొమ్మాళి, పెన్ సత్తా, నవంబర్ 15:టెక్కలి ప్రాంతానికి చెందిన తైక్వాండో క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో అరుదైన ఘనత సాధించి భారతదేశ కీర్తి ప్రతిష్టలను ప్రపంచ వ్యాప్తంగా చాటడం గర్వకారణమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. సోమవారం నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ గుర్తింపు పొందిన టెక్కలి ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రం తైక్వాండో క్రీడాకారులు, శిక్షకుడు నర్సిపురం శేఖర్ బృందాన్ని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. 2026 ఆగస్టు 9 న తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ లోని గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన తైక్వాండో పోటీల్లో టెక్కలి ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రానికి చెందిన క్రీడాకారులు, కోచ్ నర్సిపురం శేఖర్‌తో పాటు మెండ తపస్వి (బ్లాక్ బెల్ట్), తమిరె జ్ఞానదీప్, అట్టాడ మహీధర్ నాయుడు పాల్గొని అరుదైన ప్రపంచ రికార్డు సాధన కోసం తమ ప్రతిభను చాటారు. ఈ ఘనతను అధికారికంగా ధ్రువీకరిస్తూ లండన్, యునైటెడ్ కింగ్ డమ్ లోని గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ సంస్థ సర్టిఫికెట్లు, బంగారు పతకాలను పంపించింది.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ టెక్కలి ప్రాంత క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. క్రీడాకారుల కృషి, పట్టుదలతో పాటు కోచ్ శేఖర్ అందించిన శిక్షణ అభినందనీయమని పేర్కొన్నారు. ఈ విజయం టెక్కలి ప్రాంతానికే కాకుండా యావత్ భారతదేశానికి గర్వకారణమని కొనియాడారు. భవిష్యత్తులోనూ మరిన్ని విజయాలు సాధించి రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ఎలక్ట్రిక్ బస్సులను జెండా ఊపి ప్రారంభించిన పల్లా శ్రీనివాసరావు.



- కాలుష్య రహిత, ఆధునిక ప్రయాణానికి శ్రీకారం.
- ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేస్తున్న కూటమి ప్రభుత్వం.
- పల్లా శ్రీనివాస రావు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే.

గాజువాక, పెన్ సత్తా, నవంబర్ 16: ప్రజలకు మెరుగైన, సౌకర్యవంత మైన ప్రయాణ సేవలు అందించడంతో పాటు కాలుష్య నియంత్రణకు దోహదపడేలా కూటమి ప్రభుత్వం ప్రజా రవాణా వ్యవస్థను ఆధునికీకరిస్తోందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస రావు పేర్కొన్నారు. ఇందులో భాగంగా గాజువాక ఆర్టీసీ డిపోకు కేటాయించిన 30 ఎలక్ట్రిక్ ఏసీ బస్సులను సోమవారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఈ బస్సులను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాస రావు మాట్లాడుతూ.. ఎలక్ట్రిక్ బస్సుల రాకతో గాజువాక పరిధిలో ప్రజా రవాణా మరింత సౌకర్యవంతంగా మారుతుందని తెలిపారు. పర్యావరణానికి హాని కలిగించని విద్యుత్ బస్సుల వినియోగం వల్ల కాలుష్యం తగ్గడంతో పాటు ప్రయాణికులకు మెరుగైన సేవలు అందుతాయని చెప్పారు. ఈ బస్సులు ఆర్‌కే బీచ్, జగదాంబ, సింధియా, గాజువాక ప్రాంతాలతో పాటు సింధియా--గాజువాక--ఎన్ఏడీ--పెందుర్తి, ఆర్టీసీ కాంప్లెక్స్--రైల్వే స్టేషన్--సింధియా--గాజువాక--స్టీల్ ప్లాంట్ మార్గాల్లో ప్రజలకు సేవలు అందించనున్నాయని వివరించారు. 12 మీటర్ల పొడవుతో రూపొందించిన ఈ బస్సుల్లో రెండు ప్రవేశ ద్వారాలు, సీసీటీవీ కెమెరాలు, 35 సీట్లతో పాటు నిలబడి ప్రయాణించే సదుపాయం కూడా ఉందని తెలిపారు. ఆధునిక సాంకేతికతతో రూపొందించిన ఈ బస్సులు ప్రయాణికులకు సౌకర్యవంతమైన ప్రయాణ అనుభూతిని అందిస్తాయని పేర్కొన్నారు.

ప్రధానమంత్రి ఈ-సేవా పథకం కింద ఆంధ్రప్రదేశ్ ఆర్టీసీకి 750 ఏసీ బస్సులు మంజూరయ్యాయని, వాటిలో గాజువాక డిపోకు 50 బస్సులు కేటాయించారని పల్లా తెలిపారు. ఇప్పటికే 20 ఏరో ఎక్స్‌ప్రెస్ ఏసీ బస్సులు భోగాపురం విమానాశ్రయానికి సేవలు అందిస్తున్నాయని చెప్పారు. సింహాచలం డిపోకు కూడా 50 బస్సులు కేటాయించగా, 14 బస్సులు చేరుకున్నాయని, మిగిలినవి త్వరలో అందుబాటులోకి రానున్నాయని వివరించారు. డిసెంబర్ నెలాఖరులోగా కేటాయించిన బస్సులన్నింటినీ సేవల్లోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఇందుకు అవసరమైన ఛార్జింగ్ పాయింట్ల ఏర్పాట్లు కూడా సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు.



ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వం లోని కూటమి ప్రభుత్వం ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేస్తూ, పర్యావరణ హితమైన రవాణా సదుపాయాలకు ప్రాధాన్యత ఇస్తోందని పల్లా శ్రీనివాసరావు అన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ఎలక్ట్రిక్ బస్సుల ప్రవేశం మరో ముందడుగు అని పేర్కొన్నారు.

విశాఖలో సైబర్ ఏజెంట్ల పై పీడీ యాక్ట్ ప్రయోగం.

డిజిటల్ అరెస్ట్ మోసాల గుట్టు రట్టు.

విశాఖపట్నం, పెన్ సత్తా, నవంబర్ 16:విదేశాల్లో లక్షల జీతాలతో ఉద్యోగాలంటూ నిరుద్యోగ యువతను ఆశ చూపి, కంబోడియా, మయన్మార్ వంటి దేశాలకు తరలించి అంతర్జాతీయ సైబర్ నేరాలకు పాల్పడుతున్న ఇద్దరు ప్రధాన ఏజెంట్ల పై విశాఖపట్నం సిటీ పోలీసులు ఉక్కుపాదం మోపారు. ప్రజల ఆర్థిక భద్రతకు, ప్రజా శాంతికి ముప్పుగా పరిణమించిన ఈ నేరాల పై విశాఖ నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి, ఆదేశాల మేరకు బొంగు మురళి, చుక్క రాజేష్ వినయ్ కుమార్ ల పై 1986 పీడీ యాక్ట్ కింద నిర్బంధ ఉత్తర్వులు జారీ చేసి, విశాఖపట్నం సెంట్రల్ జైలులో నిర్బంధించారు. తక్కువ చదువున్నా పర్లేదు.. విదేశాల్లో ఏసీ గదుల్లో డేటా ఎంట్రీ ఉద్యోగం.. నెలకు లక్షల్లో సంపాదన" అంటూ మోసపూరిత హామీలిచ్చి, ఈ ఏజెంట్లు యువతను చైనా ఆధారిత సైబర్ స్కామ్ కేంద్రాలకు పంపుతున్నట్లు దర్యాప్తులో తేలింది. ఒక్కో యువకుడి నుంచి సుమారు 2 లక్షల రూపాయల వరకు వసూలు చేసి, విమాన టికెట్లు, వీసా, వెయ్యి అమెరికన్ డాలర్ల విదేశీ కరెన్సీ ఏర్పాటు చేసి మరీ కంబోడియా, లావోస్, బ్యాంకాక్ దేశాలకు తరలించారు. అక్కడికి చేరుకున్న యువతతో భారతీయ పౌరులకు ఫోన్లు లేదా వీడియో కాల్స్ చేయించి.. పోలీస్, సీబీఐ, టెలికాం అధికారులమని బెదిరిస్తూ 'డిజిటల్ అరెస్ట్' పేరుతో భారీగా డబ్బులు వసూలు చేయిస్తున్నట్లు గుర్తించారు. ఈ అక్రమాలకు అంగీకరించని యువతను ఇబ్బందులకు గురిచేసినట్లు బాధితులు తెలిపారు. ప్రసాద్ గార్డెన్స్‌కు చెందిన బొంగు మురళి పై గతంలో 9 కేసులు ఉండగా, గాజువాక ప్రాంతానికి చెందిన చుక్క రాజేష్ వినయ్ కుమార్ పై 5 కేసులు నమోదయ్యాయి. జైలు నుంచి విడుదలైన తర్వాత కూడా రాజేష్ మళ్లీ యువత నుంచి బ్యాంకు ఖాతాలను సేకరించి డిజిటల్ అరెస్ట్ మోసాలకు ఉపయోగించినట్లు తేలడంతో పోలీసులు మళ్లీ అరెస్ట్ చేశారు. విదేశీ ఉద్యోగాల ప్రకటనలను నమ్మి మోసపోవద్దని, కమిషన్ల కోసం ఎవరికీ బ్యాంక్ ఖాతాలు, యూపీఐ వివరాలు ఇవ్వవద్దని విశాఖ పోలీసులు హెచ్చరించారు. డిజిటల్ అరెస్ట్ చట్టవిరుద్ధమని, సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు లేదా ఎఎఎ.ఎఎవతీఎతీఅఎవ.స్రశీఒ.అఅ



ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. నేరాలకు సహకరించే ఏజెంట్లు ఎంతటివారైనా కఠిన చర్యలు తప్పవని సీపీ స్పష్టం చేశారు.

యాక్ట్ ఈస్ట్ పాలసీకి ప్రాధాన్యం

న్యూఢిల్లీ / మనీలా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోమవారం ఫిలిప్పీన్స్ పర్యటనకు బయలుదేరారు. మనీలా వేదికగా జరగనున్న 23వ ఆసియాన్-భారత్ సదస్సు, 21వ తూర్పు ఆసియా సదస్సులో ఆయన పాల్గొననున్నారు. ఆగ్నేయాసియా దేశాలతో భారత్ సంబంధాలను మరింత బలోపేతం చేయడం, వాణిజ్యం, సముద్ర భద్రత, రక్షణ, సాంకేతిక రంగాల్లో సహకారాన్ని విస్తరించడం ఈ పర్యటనలో ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయి. ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు ఫెర్డినాండ్ ఆర్. మార్కోస్ జూనియర్ ఆహ్వానం మేరకు మోదీ ఈ పర్యటన చేపట్టారు.

రేపు రెండు కీలక సదస్సులు

నవంబర్ 17న మనీలాలో జరిగే 23వ ఆసియాన్--భారత్ సదస్సు, 21వ తూర్పు ఆసియా సదస్సులో ప్రధాని పాల్గొంటారు. ఆసియాన్ దేశాల అధినేతలతో కలిసి ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై చర్చించనున్నారు. భారత్--ఆసియాన్ సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంలో ఇప్పటివరకు సాధించిన పురోగతిని సమీక్షించడంతో పాటు భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించే అవకాశం ఉంది. ఆసియాన్ దేశాలతో భారత్‌కు శతాబ్దాల చరిత్ర కలిగిన సాంస్కృతిక, నాగరికత సంబంధాలు ఉన్నాయని మోదీ పేర్కొన్నారు. ఈ సంబంధాలు ప్రస్తుతం వాణిజ్యం, మౌలిక సదుపాయాలు, సముద్ర సహకారం, సాంకేతిక పరిజ్ఞానం, ప్రజల మధ్య సంబంధాల వరకు విస్తరించాయని తెలిపారు. భారత విదేశాంగ విధానంలో యాక్ట్ ఈస్ట్ పాలసీకి ఆసియాన్ దేశాలు కీలకమని ఆయన స్పష్టం చేశారు.

మనీలాలో ఘన స్వాగతం

మోదీ సోమవారం మనీలాలోని విమానాశ్రయానికి చేరుకోగా ఫిలిప్పీన్స్ అధికారులు, ప్రతినిధులు స్వాగతం పలికారు. సంప్రదాయ సాంస్కృతిక ప్రదర్శనతో ఆయనకు స్వాగతం లభించింది. పర్యటనలో భాగంగా ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు మార్కోస్ నిర్వహించే విందులోనూ ప్రధాని పాల్గొననున్నారు.



సముద్ర భద్రతపై ప్రత్యేక చర్చలు

2026 సంవత్సరాన్ని భారత్--ఆసియాన్ దేశాలు సముద్ర సహకార సంవత్సరంగా నిర్వహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సముద్ర భద్రత, నౌకాయాన రక్షణ, సముద్ర మార్గాల అనుసంధానం, బ్లూ ఎకానమీ వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వాన్ని కాపాడేందుకు పరస్పర సహకారాన్ని పెంచుకోవడంపై చర్చలు జరగనున్నాయి.

వాణిజ్యం, పెట్టుబడులపై దృష్టి

భారత్, ఆసియాన్ దేశాల మధ్య వాణిజ్య సంబంధాలను మరింత విస్తరించడం ఈ సదస్సులో మరో కీలక అంశం. పెట్టుబడులు, సరఫరా వ్యవస్థలు, మౌలిక సదుపాయాల అనుసంధానం, డిజిటల్ పరిజ్ఞానం, రక్షణ రంగాల్లో పరస్పర సహకారానికి ఉన్న అవకాశాలను నేతలు చర్చించనున్నారు. భారత్-ఆసియాన్ వాణిజ్య ఒప్పందం సమీక్ష కూడా ఈ సంబంధాల్లో కీలక అంశంగా కొనసాగుతోంది.

2026-2030 కార్యాచరణ ప్రణాళిక

భారత్-ఆసియాన్ సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంలో భాగంగా 2026-2030 కార్యాచరణ ప్రణాళిక అమలుపై సమీక్ష జరగనుంది. ఇప్పటికే చేపట్టిన కార్యక్రమాల పురోగతిని పరిశీలించడంతో పాటు కొత్త రంగాల్లో సహకారాన్ని ఎలా విస్తరించాలనే దానిపై నేతలు దిశానిర్దేశం చేయనున్నారు.

ప్రవాస భారతీయులతో మోదీ భేటీ

ఫిలిప్పీన్స్‌లో నివసిస్తున్న భారతీయులతోనూ ప్రధాని మోదీ సమావేశం కానున్నారు. అక్కడి భారతీయ సమాజంతో మాట్లాడి వారి అనుభవాలు, అభిప్రాయాలను తెలుసుకోనున్నారు. విదేశాల్లో నివసిస్తున్న భారతీయులతో సంబంధాలను బలోపేతం చేయడంలో ఈ సమావేశానికి ప్రాధాన్యం ఉంది.

2027లో కీలక వార్షికోత్సవాలు

2027లో భారత్-ఆసియాన్ మధ్య దౌత్య సంబంధాలు ప్రారంభమై 35 సంవత్సరాలు పూర్తికానున్నాయి. అలాగే సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యానికి ఐదేళ్లు పూర్తవుతాయి. ఈ నేపథ్యంలో రానున్న సంవత్సరాల్లో ద్వైపాక్షిక సంబంధాలను మరింత విస్తరించేందుకు ప్రస్తుత పర్యటన దోహదపడుతుందని విదేశాంగ శాఖ భావిస్తోంది.

ఇండో-పసిఫిక్ ప్రాంతంపై అంతర్జాతీయ దృష్టి

తూర్పు ఆసియా సదస్సులో ప్రాంతీయ భద్రత, అంతర్జాతీయ పరిణామాలు, సముద్ర వివాదాలు, ఆర్థిక సహకారం వంటి అంశాలు చర్చకు రానున్నాయి. మనీలాలో క్వాడ్ దేశాల నేతల సమావేశం నిర్వహించే ప్రయత్నాలు కూడా జరుగుతున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. అయితే ఆ సమావేశం ఖరారైన కార్యక్రమంగా ప్రకటించబడలేదు. ప్రధాని మోదీ ఫిలిప్పీన్స్ పర్యటన భారత్-ఆసియాన్ సంబంధాలు, సముద్ర భద్రత, వాణిజ్యం, ఇండో-పసిఫిక్ ప్రాంతంలో సహకారానికి సంబంధించిన కీలక దౌత్య కార్యక్రమంగా నిలవనుంది. నవంబర్ 17న జరిగే రెండు సదస్సుల్లో మోదీ పాల్గొననున్నారు.

యుద్ధ వేళ విదేశాలపై ఆధారపడే పరిస్థితి ఉండకూడదు!

న్యూఢిల్లీ: భవిష్యత్తులో యుద్ధం తలెత్తితే ఆయుధాలు, విడిభాగాలు, ఇంజిన్లు, సాంకేతిక పరిజ్ఞానం కోసం భారత్ విదేశీ శక్తులపై ఆధారపడే పరిస్థితి ఉండకూడదని భారత వైమానిక దళ చీఫ్ మార్షల్ అశుతోశ్ దీక్షిత్ స్పష్టం చేశారు. దేశ రక్షణ రంగంలో నిజమైన ఆత్మనిర్భరత సాధించడం పారిశ్రామిక లక్ష్యం మాత్రమే కాదని, అది నేరుగా సైనిక సంసిద్ధతకు సంబంధించిన అంశమని పేర్కొన్నారు. సంక్షోభ సమయాల్లో విదేశీ శక్తులు భారత రక్షణ సామర్థ్యాలను నిలువరించే అవకాశం లేకుండా స్వదేశీ సాంకేతికతను అభివృద్ధి చేసుకోవాలని పిలుపునిచ్చారు. దిల్లీలో నిర్వహించిన ఏఎస్ఐ జాతీయ భద్రతా సదస్సు 3.0లో పాల్గొన్న ఆయన భవిష్యత్ యుద్ధాలు, భారత రక్షణ సామర్థ్యాలు, స్వదేశీ ఆయుధాల అభివృద్ధి, చైనా సరిహద్దు పరిస్థితులపై కీలక వ్యాఖ్యలు చేశారు.

ఆత్మనిర్భరతే అసలైన రక్షణ కవచం

భారత వైమానిక దళానికి ఆత్మనిర్భరత అనేది కేవలం పారిశ్రామిక ఉత్పత్తి లక్ష్యం కాదని, కార్యాచరణ అవసరమని అశుతోశ్ దీక్షిత్ వివరించారు. యుద్ధ సమయంలో సోర్స్ కోడ్, విడిభాగాలు, మందుగుండు సామగ్రి, విమాన ఇంజిన్ల కోసం ఇతర దేశాలపై ఆధారపడాల్సిన పరిస్థితి రాకూడదన్నారు. స్వదేశీ పరిజ్ఞానంతోనే ఆయుధ వ్యవస్థలను నిర్వహించుకునే సామర్థ్యం దేశానికి ఉండాలని అభిప్రాయపడ్డారు. దేశ రక్షణ వ్యవస్థకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, విడిభాగాల సరఫరా నిరంతరంగా కొనసాగితేనే దీర్ఘకాలిక యుద్ధ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కోగలమని పేర్కొన్నారు.

ఆపరేషన్ సిందూర్‌తో స్వదేశీ ఆయుధాల సత్తా

త్రివిధ దళాల సమన్వయం, స్వదేశీ ఆయుధ వ్యవస్థల సామర్థ్యాన్ని ఆపరేషన్ సిందూర్ చాటిచెప్పిందని ఐఏఎఫ్ చీఫ్ పేర్కొన్నారు. ఆకాశ్, బ్రహ్మోస్ వంటి స్వదేశీ రక్షణ వ్యవస్థలు ఈ ఆపరేషన్‌లో సమర్థంగా పనిచేశాయని వివరించారు. త్రివిధ దళాల సంయుక్త కార్యకలాపాల్లో ఆపరేషన్ సిందూర్ ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచిందన్నారు. సైనిక సంసిద్ధతను అంచనా వేయడానికి నియంత్రణ, నిలకడ, పరిస్థితులకు అనుగుణంగా మారే సామర్థ్యం కీలకమని పేర్కొన్నారు.



సైబర్‌స్పేస్, అంతరిక్షంలోనే భవిష్యత్ యుద్ధాలు!

భవిష్యత్తులో యుద్ధాలు సంప్రదాయ పద్ధతుల్లోనే ప్రారంభం కావాల్సిన అవసరం లేదని అశుతోశ్ దీక్షిత్ అభిప్రాయపడ్డారు. సైబర్‌స్పేస్, విద్యుదయస్కాంత స్పెక్ట్రమ్, అంతరిక్ష రంగాల్లోనే ఘర్షణలు మొదలయ్యే అవకాశముందని హెచ్చరించారు. ప్రత్యర్థి దేశాల కంటే వేగంగా నిర్ణయాలు తీసుకోవడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించడం భవిష్యత్ యుద్ధాల్లో కీలకమవుతాయని వివరించారు.

క్షిపణుల నిల్వలే పెద్ద సవాలు

ఆధునిక యుద్ధాల్లో ఆయుధాల వినియోగంతో పాటు వాటి నిల్వలు, ఉత్పత్తి సామర్థ్యం కూడా కీలకమని ఆయన పేర్కొన్నారు. అమెరికా పేట్రియాట్ గగనతల రక్షణ క్షిపణుల వినియోగాన్ని ఉదాహరణగా ప్రస్తావించారు. ఇరాన్‌తో జరిగిన యుద్ధంలో అమెరికా తన క్షిపణి నిల్వల్లో గణనీయమైన భాగాన్ని వినియోగించిందని, వాటిని తిరిగి సమకూర్చుకోవడానికి ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉందని వివరించారు. దీంతో అత్యాధునిక రక్షణ పరిశ్రమలు ఉన్న దేశాలకు సైతం యుద్ధ అవసరాలకు అనుగుణంగా ఆయుధాల ఉత్పత్తి, నిల్వల నిర్వహణ పెద్ద సవాలుగా మారుతోందని ఆయన వ్యాఖ్యల సారాంశం.

తేజస్, ఎల్‌సీఏ మార్క్-2పై ఆశలు

స్వదేశీ యుద్ధ విమానాల అభివృద్ధిపై భారత వైమానిక దళం ప్రత్యేక దృష్టి పెట్టిందని అశుతోశ్ దీక్షిత్ తెలిపారు. ఎల్‌సీఏ మార్క్-1ఏ విమానాలను వైమానిక దళంలోకి చేర్చుకునే ప్రక్రియ కొనసాగుతోందని, తదుపరి తరం ఎల్‌సీఏ మార్క్-2, అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఏఎంసీఏ) అభివృద్ధి పనులు కూడా ముందుకు సాగుతున్నాయని వివరించారు. ఒక యుద్ధ విమానాన్ని అభివృద్ధి చేయాలంటే అనేక శాస్త్రీయ విభాగాల్లో నైపుణ్యం అవసరమని, తేజస్ అభివృద్ధిలో దేశవ్యాప్తంగా ఉన్న సంస్థలు, ప్రయోగశాలలు, పరిశోధనా కేంద్రాలు భాగస్వాములయ్యాయని పేర్కొన్నారు.

చైనా కదలికలపై నిఘా

చైనా సరిహద్దుల్లో చోటుచేసుకుంటున్న పరిణామాలను భారత వైమానిక దళం నిరంతరం పర్యవేక్షిస్తోందని ఐఏఎఫ్ చీఫ్ వెల్లడించారు. ఎలాంటి ముప్పునైనా ఎదుర్కొనేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. చైనా చేపట్టే దురాక్రమణ ప్రయత్నాలను నిలువరించే సామర్థ్యం భారత్‌కు ఉందని ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం భారత్-చైనా సరిహద్దుల్లో పూర్తిస్థాయి శాంతి పరిస్థితులు లేవని, అదే సమయంలో యుద్ధ వాతావరణం కూడా లేదని వివరించారు. అవసరాన్ని బట్టి రక్షణాత్మక, దాడి వ్యూహాలకు మారేందుకు వైమానిక దళం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.

స్వదేశీ రక్షణ రంగమే భవిష్యత్‌కు పునాది

మొత్తంగా భవిష్యత్ యుద్ధాల్లో విజయం సాధించాలంటే ఆయుధాల సంఖ్యతో పాటు వాటి తయారీ, మరమ్మతులు, సాంకేతిక నియంత్రణపై దేశానికి సంపూర్ణ సామర్థ్యం ఉండాలని అశుతోశ్ దీక్షిత్ వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి. విదేశీ సరఫరాలపై ఆధారపడకుండా స్వదేశీ రక్షణ పరిశ్రమను బలోపేతం చేయడం ద్వారా మాత్రమే దీర్ఘకాలిక సైనిక సంసిద్ధత సాధ్యమవుతుందనే అంశాన్ని ఆయన ప్రధానంగా ప్రస్తావించారు.

కుటుంబంపై ప్రచారమైన అసత్యాలకు నా ఆత్మకథే సమాధానం!

న్యూఢిల్లీ: తన కుటుంబం గురించి ఎన్నో అవాస్తవాలు, కల్పిత కథనాలు ప్రచారంలోకి వచ్చాయని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ అన్నారు. తన అత్త ఇందిరా గాంధీ, భర్త రాజీవ్ గాంధీ, కుమారుడు రాహుల్ గాంధీ, కుమార్తె ప్రియాంక గాంధీతో పాటు తన వ్యక్తిగత జీవితం గురించి కూడా అనేక అసత్య ప్రచారాలు జరిగాయని పేర్కొన్నారు. ఇలాంటి కథనాలకు వాస్తవాలతో సమాధానం చెప్పాలనే ఉద్దేశంతోనే తన ఆత్మకథ రాయాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. సోమవారం దిల్లీలో తన ఆత్మకథ 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు.

కుటుంబ జీవితంలోని ఎన్నో తెలియని విషయాలు

తన జీవితంలో ఎదురైన అనుభవాలు, కుటుంబంతో అనుబంధం, రాజకీయ ప్రయాణం, వ్యక్తిగత జీవితంలోని ముఖ్యమైన ఘట్టాలను ఈ పుస్తకంలో పొందుపరిచినట్లు సోనియా గాంధీ తెలిపారు. తన కుటుంబం గురించి ప్రజల్లో అనేక రకాల కథనాలు ప్రచారంలో ఉన్నాయని, వాటిలో చాలా వరకు వాస్తవాలకు దూరంగా ఉన్నాయని అన్నారు. తనకు తెలిసిన నిజాలను, తాను స్వయంగా అనుభవించిన విషయాలను ప్రజలతో పంచుకోవాలనే ఉద్దేశంతో ఈ పుస్తకాన్ని రచించినట్లు వివరించారు.

రాహుల్, ప్రియాంక సమక్షంలో ఆవిష్కరణ

దిల్లీలోని ఐటీసీ మౌర్య హోటల్‌లో సోనియా గాంధీ ఆత్మకథ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సోనియా కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతల సమక్షంలో పుస్తకాన్ని ఆవిష్కరించారు.



ఇండియా కూటమి నేతల సందడి

ఈ కార్యక్రమానికి ఇండియా కూటమికి చెందిన పలువురు ప్రముఖ నేతలు హాజరయ్యారు. తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, తృణమూల్ కాంగ్రెస్ నేత అభిషేక్ బెనర్జీ, ఝార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, ఎన్సీపీ నేత సుప్రియా సూలే తదితరులు పాల్గొన్నారు. అలాగే కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖు సహా పలువురు రాజకీయ ప్రముఖులు ఈ వేడుకకు హాజరయ్యారు.

రాజకీయాల వెనుక వ్యక్తిగత ప్రయాణం

సోనియా గాంధీ ఆత్మకథలో ఆమె వ్యక్తిగత జీవితం, రాజీవ్ గాంధీతో పరిచయం, వివాహం, నెహ్రూ-గాంధీ కుటుంబంతో అనుబంధం, రాజకీయాల్లోకి ప్రవేశం, కాంగ్రెస్ నాయకత్వ బాధ్యతలు వంటి అంశాలకు ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలుస్తోంది. కుటుంబంలో ఎదురైన విషాదాలు, రాజకీయ జీవితంలో ఎదురైన సవాళ్లు, ప్రజా జీవితంలో తన అనుభవాలను కూడా ఈ రచన ద్వారా పాఠకులకు పరిచయం చేయనున్నారు. దశాబ్దాల రాజకీయ ప్రస్థానంలో ఎన్నో కీలక పరిణామాలకు సాక్షిగా నిలిచిన సోనియా గాంధీ తన జీవితాన్ని స్వయంగా అక్షరబద్ధం చేయడం ఈ పుస్తకానికి ప్రత్యేకతగా నిలుస్తోంది. కుటుంబం, రాజకీయాలు, వ్యక్తిగత అనుభవాల సమ్మేళనంగా వెలువడిన ఈ ఆత్మకథపై రాజకీయ, సాహిత్య వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

ఎస్ఐఆర్‌పై ఈసీని నిలదీసేందుకు అనుమతించండి!

న్యూఢిల్లీ: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సహా ఇండియా కూటమి విపక్ష నేతలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈసీ నిర్ణయాలు, ఓటర్ల తొలగింపు ప్రక్రియ, ఆన్‌లైన్ ఓటరు నమోదు వ్యవస్థల్లో చేసిన మార్పులపై సమాధానాలు కోరుతూ 48 ప్రశ్నలతో కూడిన ప్రశ్నావళిని న్యాయస్థానానికి సమర్పించారు. ఈ వ్యవహారంలో ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయాల వెనుక ఉన్న విధానాలు, వాటికి సంబంధించిన అధికారిక రికార్డులపై స్పష్టత ఇవ్వాలని పిటిషన్‌లో కోరారు.

సీఈసీ ఏకపక్షంగా నిర్ణయించారా?

దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ అమలుకు సంబంధించిన నిర్ణయాలను ఎన్నికల సంఘం సమిష్టిగా తీసుకుందా? లేక ఇతర ఎన్నికల కమిషనర్ల అంగీకారం లేకుండానే ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ నిర్ణయాలు తీసుకున్నారా? అనే అంశాన్ని విపక్ష నేతలు ప్రధానంగా ప్రస్తావించారు. ఈ ప్రక్రియకు అనుమతిస్తూ ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయానికి సంబంధించిన అధికారిక రికార్డులు, సమావేశాల వివరాలను వెల్లడించాలని కోరారు. ఎన్నికల సంఘం నిర్ణయాధికారాన్ని ఏ విధంగా వినియోగించిందనే అంశంపై వివరణ అవసరమని పేర్కొన్నారు.

ఓట్ల తొలగింపుపై సమాధానాలివ్వాలి

ప్రత్యేక సమగ్ర సవరణ పేరుతో ఓటర్ల జాబితాల నుంచి పేర్లు తొలగిస్తున్నారనే ఆరోపణలపై కూడా విపక్ష నేతలు ప్రశ్నలు లేవనెత్తారు. ఓటర్ల పేర్ల తొలగింపునకు అనుసరిస్తున్న విధానం, దానికి సంబంధించిన నిబంధనలు, అధికారుల బాధ్యతలపై స్పష్టత ఇవ్వాలని కోరారు. డిప్యూటీ ఎన్నికల కమిషనర్ నుంచి ఈ అంశాలకు సంబంధించిన సమాధానాలు కోరేందుకు అనుమతి ఇవ్వాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఓటర్ల హక్కులకు సంబంధించిన ప్రక్రియలో పారదర్శకత ఉండాలని అభిప్రాయపడ్డారు.

ఫారం-6లో మార్పులపై అభ్యంతరాలు

కొత్త ఓటరు నమోదుకు ఉపయోగించే ఆన్‌లైన్ ఫారం-6లో చేసిన మార్పులు, ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ఈసీఐనెట్, ఈఆర్‌వోనెట్ వ్యవస్థల పనితీరుపైనా విపక్ష నేతలు ప్రశ్నలు సంధించారు. ఈ డేటాబేస్‌లు కేంద్రీకృతంగా ఉండటంతో పాటు వాటి నిర్వహణలో పారదర్శకత లోపించిందని వారు ఆరోపించారు. ఎన్నికల సంఘం పోర్టల్‌లో ఎప్పటికప్పుడు చేసిన అప్‌డేట్లు, మార్పుల వివరాలు, వాటిని అమలు చేసిన అధికారుల సమాచారాన్ని అందించాలని కోరారు.

ఈసీ వాదన మరోలా..

మరోవైపు ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి తాము తీసుకున్న నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగానే జరిగాయని ఎన్నికల సంఘం ఇప్పటికే సుప్రీంకోర్టుకు తెలిపింది. చట్ట నిబంధనలకు అనుగుణంగానే ప్రత్యేక సమగ్ర సవరణ చేపట్టామని వివరించింది. ఫారం-6లో ఎలాంటి మార్పులు చేయలేదని కూడా స్పష్టం చేసింది. దీంతో ఎన్నికల సంఘం వాదనలకు, విపక్ష నేతలు లేవనెత్తుతున్న సందేహాలకు మధ్య వివాదం కొనసాగుతోంది.

17న సుప్రీంకోర్టులో కీలక విచారణ

ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రధాన ఎన్నికల కమిషనర్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, ఇష్టానుసారంగా ఓటర్ల పేర్లు తొలగిస్తున్నారని ఆరోపిస్తూ రాహుల్ గాంధీ సహా 12 మంది విపక్ష నేతలు గతంలో సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లు ప్రస్తుతం విచారణలో ఉన్నాయి. ఈ కేసులపై నవంబర్ 17న సుప్రీంకోర్టు మరోసారి విచారణ చేపట్టనుంది. ఈ నేపథ్యంలో 48 ప్రశ్నలతో కూడిన తాజా ప్రశ్నావళి ప్రాధాన్యం సంతరించుకుంది. ఎన్నికల సంఘం నిర్ణయాల ప్రక్రియ, ఓటర్ల జాబితాల సవరణలో పారదర్శకత, ఓటర్ల హక్కుల పరిరక్షణ వంటి అంశాలపై న్యాయస్థానం విచారణలో ఎలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయన్నది ఆసక్తికరంగా మారింది.

ఇంధన ధరల సెగ..

టోకు ద్రవ్యోల్బణం 12.29 శాతానికి!

న్యూఢిల్లీ, నవంబర్ 16: దేశంలో టోకు ధరల ద్రవ్యోల్బణం మరోసారి భారీగా పెరిగింది. ఇంధనం, ముడి చమురు, విద్యుత్ ధరలు ఎగబాకడంతో అక్టోబరు నెలలో హోల్‌సేల్ ప్రైస్ ఇండెక్స్ ఆధారిత ద్రవ్యోల్బణం 12.29 శాతానికి చేరింది. సెప్టెంబరులో నమోదైన 11.39 శాతంతో పోలిస్తే గణనీయంగా పెరిగింది. వరుసగా మూడో నెల కూడా టోకు ధరల ద్రవ్యోల్బణం పెరగడం ఆర్థిక వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ మేరకు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ సోమవారం గణాంకాలను విడుదల చేసింది.

ఇంధనం, విద్యుత్ ధరలే ప్రధాన కారణం

అక్టోబరులో ఇంధనం, విద్యుత్ విభాగంలో ద్రవ్యోల్బణం 32.84 శాతానికి చేరింది. సెప్టెంబరులో ఇది 25.85 శాతంగా ఉంది. ముడి చమురు, సహజ వాయువు, మినరల్ ఆయిల్స్ ధరలు పెరగడం ఈ పరిణామానికి ప్రధాన కారణంగా నిలిచింది. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరల్లో మార్పులు దేశీయ ఇంధన వ్యయాలపై ప్రభావం చూపుతున్నాయి.

ముడి చమురు, సహజ వాయువులో భారీ పెరుగుదల

ముడి పెట్రోలియం, సహజ వాయువు విభాగంలో ద్రవ్యోల్బణం సెప్టెంబరులో 57.32 శాతంగా ఉండగా అక్టోబరులో 70.80 శాతానికి పెరిగింది. మినరల్ ఆయిల్స్‌లోనూ ద్రవ్యోల్బణం 40.02 శాతం నుంచి 45.57 శాతానికి చేరింది. విద్యుత్ విభాగంలో గత నెల నమోదైన 0.43 శాతం క్షీణత స్థానంలో అక్టోబరులో 8.06 శాతం ద్రవ్యోల్బణం నమోదైంది.

ప్రాథమిక వస్తువుల ధరలూ పైపైకి

ప్రాథమిక వస్తువుల ద్రవ్యోల్బణం సెప్టెంబరులో 8.67 శాతంగా ఉండగా అక్టోబరులో 9.24 శాతానికి పెరిగింది. ప్రాథమిక ఆహార పదార్థాల ద్రవ్యోల్బణం 8.14 శాతం నుంచి 8.26 శాతానికి చేరింది. ఆహార పదార్థాలు, లోహాలు, రసాయనాల ధరల పెరుగుదల కూడా టోకు ధరల సూచీపై ప్రభావం చూపింది.

పాక్ చేతికి లక్ష ఎఫ్‌పీవీ డ్రోన్లు!

న్యూఢిల్లీ: ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ఎదురైన సైనిక సవాళ్ల తర్వాత పాకిస్థాన్ తన రక్షణ సామర్థ్యాలను మరింత పెంచుకునే దిశగా అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా తన మిత్రదేశమైన తుర్కియేతో భారీ రక్షణ ఒప్పందం కుదుర్చుకున్నట్లు రక్షణ రంగానికి చెందిన పలు కథనాలు వెల్లడిస్తున్నాయి. మూడేళ్ల కాలంలో లక్ష మెర్కుట్ ఎఫ్‌పీవీ డ్రోన్లను కొనుగోలు చేయడంతో పాటు పలు రకాల మానవరహిత యుద్ధ వ్యవస్థలను సమకూర్చుకోవాలని నిర్ణయించినట్లు సమాచారం. పాకిస్థాన్‌లోనే వీటి తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసే ప్రతిపాదన కూడా ఈ ఒప్పందంలో ఉన్నట్లు తెలుస్తోంది.

డ్రోన్లతో పాటు ఇతర యుద్ధ వ్యవస్థలు

ఈ ఒప్పందంలో భాగంగా లక్ష మెర్కుట్ ఎఫ్‌పీవీ డ్రోన్లతో పాటు పది ఆల్బ్రెన్ మానవరహిత హెలికాప్టర్లు, 25 చిన్న హెలికాప్టర్లు, 500 డీఎల్ఈ తరహా సంచార దాడి ఆయుధాలు, 250 కోర్గాన్ భూతల వ్యవస్థలు సరఫరా కానున్నట్లు రక్షణ రంగ కథనాలు పేర్కొంటున్నాయి. వీటిని పాకిస్థాన్ సైనిక అవసరాలకు అనుగుణంగా వినియోగించుకోవడంతో పాటు స్థానికంగా తయారీ చేపట్టేలా ఏర్పాట్లు చేయనున్నట్లు సమాచారం. అయితే ఈ ఒప్పందానికి సంబంధించిన పూర్తి వివరాలు, అధికారిక ధ్రువీకరణపై స్పష్టత రావాల్సి ఉంది.

8 కిలోమీటర్ల పరిధిలో లక్ష్యాలను గుర్తించే సామర్థ్యం

మెర్కుట్ ఎఫ్‌పీవీ డ్రోన్ల పరిధి సుమారు 8 కిలోమీటర్లుగా పేర్కొంటున్నారు. ఇవి 20 నుంచి 30 నిమిషాల పరకు గాల్లో ఉండగలవని సమాచారం. వీటిలో పేలుడు పదార్థాలు అమర్చే సామర్థ్యం ఉందని, కొన్ని నమూనాల్లో చిన్న లోహపు గుండ్లను వినియోగించే పేలుడు సామగ్రి ఉంటుందని రక్షణ కథనాలు వెల్లడిస్తున్నాయి.

మానవరహిత హెలికాప్టర్లతో భారీ దాడులు?

ఆల్బ్రెన్ మానవరహిత హెలికాప్టర్లు భారీ పేలుడు సామగ్రిని మోసుకెళ్లగల సామర్థ్యం కలిగి ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ముందుగానే నిర్దేశించిన లక్ష్యాలు, మార్గాలకు అనుగుణంగా స్వయంచాలకంగా పనిచేసే సాంకేతికతను వీటిలో ఉపయోగించినట్లు సమాచారం. రాత్రివేళల్లో కార్యకలాపాల కోసం ఉష్ణ దృశ్య, రాత్రి దృష్టి సాంకేతికతలను కూడా వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక డుమ్మరుల్ వ్యవస్థను స్వల్ప దూర నిఘా, దాడి కార్యకలాపాలకు ఉపయోగించవచ్చని రక్షణ రంగ కథనాలు పేర్కొంటున్నాయి. ఈ వ్యవస్థ సుమారు రెండు గంటల పాటు గాల్లో ఉండగలదని సమాచారం. ఎఫ్‌పీవీ అంటే ఫస్ట్ పర్సన్ వ్యూ. అంటే మొదటి వ్యక్తి దృష్టికోణం నుంచి యుద్ధరంగాన్ని వీక్షించే సాంకేతికత. ఈ తరహా డ్రోన్లకు ముందు భాగంలో కెమెరా ఉంటుంది.

పెన్ సత్తా
RNI:APTEL/2023/87729
మంగళవారం 17 నవంబర్ 2026

భారీ చిట్టాతో ఢిల్లీకి చంద్రబాబు.. కేంద్ర మంత్రివర్గంపై చర్చ, వేమిరెడ్డికి చాన్స్?



ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ పర్యటనలో ప్రధాని మోదీతో పాటు పలువురు కేంద్ర మంత్రులను కలవనున్నట్లు సమాచారం. రెండు తుఫాన్లతో ఏపీకి జరిగిన రూ.7 వేల కోట్ల నష్టానికి పరిహారం కోరడంతో పాటు, రాష్ట్రానికి మరో కేంద్ర మంత్రి పదవి ఇవ్వాలని ప్రతిపాదించే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి మంత్రి పదవి కల్పించే అంశంపై కూడా చర్చ జరగవచ్చని టీడీపీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది.

ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ పర్యటన తీవ్ర ఉత్కంఠ రేపుతోంది. ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు సీఎం ఢిల్లీ వెళ్లనున్నప్పటికీ, ఆ కార్యక్రమానికి ముందు వెనుక పలువురు కేంద్ర మంత్రులను కలిసే షెడ్యూల్ రెడీ అవ్వడమే రాజకీయ వర్గాలను ఆకర్షిస్తోంది. సహజంగా సీఎం ఢిల్లీ వస్తారంటేనే చాలా పెద్ద లిస్టు బయటకు తీస్తారని, ఈ సారి ఆయన చిట్టాలో ఏయే అంశాలు ఉన్నాయనే ఆసక్తి అందరిలో కనిపిస్తోంది. ముఖ్యంగా గత రెండున్నరేళ్లుగా కేంద్ర ప్రభుత్వానికి అత్యంత నమ్మకమైన మిత్రుడిగా మెలుగుతున్న చంద్రబాబు రాష్ట్రానికి భారీ ఎత్తున నిధులు, ప్రాజెక్టులు తీసుకుపోతున్నారు. దీనిపై ఇతర రాష్ట్రాల నుంచి కేంద్రంపై ఒత్తిడి ఉన్నట్లు చెబుతున్నారు.

ముఖ్యంగా ఎన్డీఏ పాలనలో ఉన్న మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాలను మించి ఎక్కువ పెట్టుబడులను ఆకర్షిస్తున్న ఏపీకి అదనపు ప్రయోజనాలు కల్పించాలని సీఎం చంద్రబాబు కేంద్రంపై ఒత్తిడి చేస్తున్నారని ప్రచారం జరుగుతోంది. దీంతో ఆయన తాజా ఢిల్లీ పర్యటన విశేషాలపై సర్వాత్రా ఆసక్తి నెలకొందని అంటున్నారు. మంగళవారం ఉదయం గన్నవరం నుంచి ఢిల్లీకి పయనమవుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు షెడ్యూల్ మొత్తం బిజీబిజీగా ఉందని చెబుతున్నారు. ఢిల్లీ విమానాశ్రయం నుంచి నేరుగా ప్రధాని నరేంద్రమోదీతో భేటీ కోసం వన్ జనపథ్ కి సీఎం వెళ్లనున్నారని చెబుతున్నారు. అక్కడే పలువురుకేంద్ర పెద్దలతో ఆయన భేటీ అవుతారని అంటున్నారు. ఉదయం 12.10 నుంచి సాయంత్రం 6.50 వరకు సీఎం ఢిల్లీలో ఉండనున్నారు. దీంతో సీఎం ఏయే కేంద్ర మంత్రులను కలుస్తారనేది ఉత్కంఠ రేపుతోంది.

ముఖ్యంగా ఇటీవల రెండు తుఫాన్లతో అతలాకుతలమైన రాష్ట్రాన్ని ఆదుకోవాలని సీఎం కేంద్రాన్ని కోరుతున్నారు. ఈ తుపాన్ల కారణంగా సుమారు 7 వేల కోట్ల నష్టం వాటిల్లిందని అధికారులు తేల్చారు. కేంద్ర బృందం కూడా తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించింది. ఈ నేపథ్యంలో ఆ మొత్తాన్ని విరివిగా కేటాయించాలని సీఎం కేంద్రాన్నికోరుతున్నారు. అదే సమయంలో కీలక రాజకీయ అంశాలపైనా చర్చ జరిగే అవకాశం ఉందని అంటున్నారు. వచ్చేనెల ఆరంభంలో పార్లమెంటు శీతా కాల సమావేశాలు జరగనున్నాయి. వీటికి ముందు కేంద్ర మంత్రివర్గాన్ని విస్తరించే అవకాశం ఉందని అంటున్నారు. ఆ తర్వాత పెండింగులో ఉన్న రాజ్యాంగ సవరణ బిల్లుల ఆమోదంపైనా సీఎంతో కేంద్ర పెద్దలు చర్చించే అవకాశం ఉందని అంటున్నారు. దీంతో సీఎం టూర్ పై రాజకీయంగా ఆసక్తి నెలకొంది.

రాష్ట్రానికి మరో మంత్రి పదవి

త్వరలో జరగబోయే మంత్రివర్గ విస్తరణలో రాష్ట్రం నుంచి ఒకరికి మంత్రి పదవి ఇవ్వాలని సీఎం చంద్రబాబు ప్రతిపాదిస్తున్నారని ప్రచారం జరుగుతోంది. ఎన్నికల సమయంలో నెల్లూరుకు చెందిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి లేదా ఆయన సతీమణికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఎక్కడో ఒక చోట మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చారని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. అయితే సామాజిక సమీకరణాల దృష్ట్యా కోవూరు

ఎమ్మెల్యేగా ఉన్న రాష్ట్రంలో వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి అవకాశం ఇవ్వలేకపోయారని అంటున్నారు. కేంద్రంలో కూడా మూడు మంత్రి పదవులు ఇవ్వగా రెండు అగ్రవర్ణాలకు కేటాయించడం వల్ల వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పేరు వెనక్కి వెళ్లిపోయిందని చెబుతున్నారు. అయితే వేమిరెడ్డి అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని ఆయనను మంత్రిని చేస్తే కేంద్రంలో మరిన్ని నిధులు సమీకరణకు ఉపయోగపడుతుందని సీఎం భావిస్తున్నారని చెబుతున్నారు. దీంతో ఎట్టి పరిస్థితుల్లోనూ తమకు మరో మంత్రి పదవి ఇవ్వాలని సీఎం ప్రతిపాదిస్తున్నట్లు చెబుతున్నారు. తాజా పర్యటనలో ఈ విషయమై ప్రధాని మోదీతో చర్చించే అవకాశం ఉందని అంటున్నారు.

విజయసాయిరెడ్డి ఎక్కడ? పార్టీ ప్రకటన తర్వాత కనిపించని పీఆర్పీ అధినేత



కొత్తగా పరివర్తన రాజనీతి పార్టీ (పీఆర్పీ) ప్రకటించిన విజయసాయిరెడ్డి ప్రస్తుతం ఢిల్లీలో పార్టీ విస్తరణ వ్యూహాలపై కసరత్తు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. జెన్ జీ యువత, బీసీలకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు డిజిటల్ ప్రచారంపై దృష్టి పెట్టినట్లు సమాచారం. ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్‌తోనూ సంప్రదింపులు జరుపుతున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కొత్తగా పార్టీ ప్రకటించిన మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి ఎక్కడున్నారనే విషయమై విస్తృత చర్చ జరుగుతోంది. ఈ నెల 11న పరివర్తన రాజనీతి పార్టీ (పీఆర్పీ)ని స్థాపిస్తున్నట్లు ప్రకటించిన మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి ఆ తర్వాత ఎక్కడా కనిపించడం లేదు. దీంతో ఆయన తెరచాటు రాజకీయ వ్యూహాలు ఆసక్తి రేకెత్తిస్తున్నాయి. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావంలోనూ ఆ పార్టీ విస్తరణలో కీలకంగా పనిచేసిన విజయసాయిరెడ్డి ఇప్పుడు తన సొంత పార్టీ కోసం ఒంటరిగా వ్యూహాలు రచించుకోవాల్సివచ్చిందని అంటున్నారు. తన పార్టీలో జెన్ జీ యువత, బీసీలకు ఎక్కువ అవకాశాలు ఇస్తానని ప్రకటించిన విజయసాయిరెడ్డి ఆయా వర్గాలను ఆకర్షించేందుకు ఎలాంటి వ్యూహాలు అమలు చేయాలనే అంశంపై నిపుణులతో సంప్రదిస్తున్నారని, ప్రస్తుతం ఈ పనుల్లో బిజీగా ఉన్నందున ఇతరులకు అందుబాటులో లేరని చెబుతున్నారు.సహజంగా ఎవరైనా రాజకీయ పార్టీ ప్రకటించిన వెంటనే కొత్త వారిని చేర్చుకోవడానికి తమ పార్టీ సిద్ధాంతాలు తెలియజేయడానికి ఎక్కువ ప్రయత్నిస్తారు. విస్తృత పర్యటనలతో ప్రజల్లోకి చొచ్చుకెళ్లేందుకు ప్రాధాన్యమిస్తారు. కానీ, విజయసాయిరెడ్డి భిన్నమైన మార్గాన్ని ఎంచుకున్నారని చెబుతున్నారు. తన పార్టీని డిజిటల్ మాధ్యమాల ద్వారా ప్రజల్లోకి తీసుకువెళ్లే ప్లాన్ చేస్తున్నారని చెబుతున్నారు. ప్రస్తుతం ప్రజలు ఎక్కువగా సోషల్ మీడియాకు కనెక్ట్ అయివున్నందున తాను కూడా డిజిటల్ విధానంలో పార్టీ ప్రచారం చేసి అందరికీ దగ్గరవ్వాలని విజయసాయిరెడ్డి వ్యూహంగా చెబుతున్నారు. ఇందుకోసం ఆయన ఢిల్లీ వేదికగా నిపుణులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు చెబుతున్నారు.

ప్రధానంగా ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ తో విజయసాయిరెడ్డి చర్చిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. గతంలో వైసీపీకి సలహాదారుగా పనిచేసిన ప్రశాంత్ కిషోర్ ను తాను వాడుకోవాలని విజయసాయిరెడ్డి భావిస్తున్నారని చెబుతున్నారు. వైసీపీ, ప్రశాంత్ కిషోర్ మధ్య డీల్ కుదర్చడంలో విజయసాయిరెడ్డిది కీలక పాత్రగా చెబుతున్నారు. అప్పటి పరిచయంతో ఆయనను తనకు సలహాదారుగా ఉండాలని విజయసాయిరెడ్డి సంప్రదించారని ఢిల్లీ వర్గాల భోగట్టా. అయితే ప్రస్తుతం సొంత పార్టీ పెట్టుకున్న పీకే ఈ విషయంలో ఎలాంటి హామీ ఇవ్వలేదని చెబుతున్నారు. అదేసమయంలో విజయసాయిరెడ్డితో ఉన్న పరిచయం కారణంగా తన శిష్యులతో మాట్లాడి మంచి వ్యూహకర్తను నియమించుకునేలా సాయం చేస్తానని పీకే హామీ ఇచ్చినట్లుగా చెబుతున్నారు.

ప్రస్తుతం ఢిల్లీలో విజయసాయిరెడ్డి ఉన్నారని చెబుతున్నా, ఆయన పర్యటనలు, భేటీలు అన్నీ రహస్యంగా సాగుతున్నాయని చెబుతున్నారు. దీంతో విజయసాయిరెడ్డి కదలికలపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది. రాష్ట్రంలో మూడో ప్రత్యామ్నాయం అవుతానని చెబుతున్న విజయసాయిరెడ్డి రానున్న రెండేళ్లలో ఒక పద్ధతి ప్రకారం

పార్టీని విస్తరించే ప్లాన్ లో ఉన్నారని అంటున్నారు. ఇందుకోసం ఇప్పటికే పలువురు వైసీపీ నేతలతో ఆయన చర్చలు సాగిస్తున్నారని, విజయసాయిరెడ్డి పార్టీకి ప్రజల్లో ఆదరణపై భిన్నాభిప్రాయాలు ఉండటంతో వారు వెనక్కి తగ్గుతున్నారని చెబుతున్నారు. అయితే పాత నేతలకు బదులుగా కొత్తవారితోనే ప్రయోగం చేయాలని విజయసాయిరెడ్డి భావిస్తున్నారని ఆయన మద్దతు దారులు చెబుతున్నారు. మొత్తానికి పీఆర్పీ ప్రకటన తర్వాత విజయసాయిరెడ్డి బయట కనిపించకుండా తిరుగుతుండటం, ఆయన వ్యూహకర్తలతో సంప్రదిస్తున్నారనే ప్రచారం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ అవుతోంది.

లోకల్ ఎన్నికల తర్వాత టీడీపీలో జరిగిన మార్పులివేనా?



ఆంధ్రప్రదేశ్ లో స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత టీడీపీ కార్యకర్తల్లో మునుపటి ఉత్సాహం కనిపించడం లేదు. ఈ ఎన్నికలపై టీడీపీ క్యాడర్, నేతలు చాలా ఆశలు పెట్టుకున్నారు. తాము ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో పడిన కష్టానికి, శ్రమకు ఫలితం లభిస్తుందని ఎక్కువ మంది ఆశించారు. కానీ అనేక కారణాలతో కొందరికే ఈ అవకాశం దక్కింది. కూటమిలో ఉండటం వల్ల మిత్ర పక్షాలకు కేటాయింపుతో పాటు కొన్ని చోట్ల సామాజికవర్గాల సమీకరణాల నేపథ్యంలో కష్టపడిన వారికి పదవులు లభించలేదు. కూటమిలో పోటీ చేసి విజయం సాధిద్దామని భావించిన వారికి నిరాశ ఎదురయింది. దీంతో తాము కష్టపడినా పార్టీలో ఇక ఎప్పటికీ గుర్తింపు రాదన్న నైరాశ్యం ఎక్కువ మందిలో కనిపిస్తుంది. గత ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద ప్రాణాలకు తెగించి పోరాడిన తమకు కనీస గుర్తింపు లభించలేదన్న ఆవేదన వారిలో ఎన్నట్లు అనేక నియోజకవర్గాల్లో కనిపిస్తుంది.

కొంత ఉత్సాహం కనిపించినా...

రాష్ట్రవ్యాప్తంగా కూటమి సాధించిన భారీ విజయం శ్రేణుల్లో కొంత ఉత్సాహాన్ని నింపగా, మరోవైపు సీట్ల సర్దుబాటు, రెబల్స్‌పై వేటు వంటి అంశాల్లో కొంత అసంతృప్తి వ్యక్తమవుతోంది. అలాగే మంత్రులు, స్థానిక నేతలు, ఎమ్మెల్యేలే కారణమని కొందరు భావిస్తూ వారిని వ్యతిరేకిస్తూ సామాజికమాధ్యమాల్లో పోస్టులు పెడుతున్నారు. కార్యకర్తలకు గుర్తింపు ఇవ్వని నేతల పేర్లను నేరుగా పార్టీ నాయకత్వానికే తెలియజేస్తున్నామని వారు చెబుతున్నారు. మున్సిపల్, పరిషత్ ఎన్నికల్లో టీడీపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి 58.9 శాతం ఓట్లతో ఘనవిజయం సాధించింది.గతంలో వైఎస్సార్సీపీకి బలమైన పట్టు ఉన్న రాయలసీమలోని చిత్తూరు, అన్నమయ్య, శ్రీ సత్యసాయి జిల్లాల్లో టీడీపీ క్షేత్రస్థాయిలో తన బలాన్ని గణనీయంగా పెంచుకుంది. అయినా అప్పటికప్పుడు పార్టీలోకి వచ్చిన వారికి కండువా కప్పి వారికి సీట్లు కేటాయించడాన్ని కొందరు తప్పుపడుతున్నారు. అదేమంటే సామాజిక కోణమని, ఆర్థికంగా బలవంతులని చెప్పి తమను నచ్చ చెప్పే ప్రయత్నం చేస్తున్నారని, ఇక జెండా మోసి తమ భుజాల బరువు ఎందుకని కొందరయితే నేరుగా తాము పార్టీకి రాజీనామాలు చేస్తున్నట్లు నెట్టింట పోస్టులు పెడుతున్నారు.

అసంతృప్తికి దారితీసిన అంశాలివే...

పొత్తులో భాగంగా టీడీపీకి బలమైన పట్టు ఉన్న కొన్ని స్థానాలను జనసేన, బీజేపీలకు కేటాయించడం స్థానిక క్యాడర్‌లో అసంతృప్తికి కారణమైంది. కనీసం 27 జెడ్పీటీసీ స్థానాల్లో క్రాస్ ఓటింగ్, రెబల్ అభ్యర్థులు మరియు టికెట్ల కేటాయింపు విభేదాలు కూటమిపై ప్రభావం చూపాయి. పార్టీ ఆదేశాలను ధిక్కరించి పోటీ చేసిన 11 మందికి పైగా రెబల్ నేతలను అధిష్టానం సస్పెండ్ చేసింది. అధికారంలోకి వచ్చాక కష్టపడిన కార్యకర్తలకు పదవులు దక్కడం లేదని, గంగాధర నెల్లూరు వంటి నియోజకవర్గాల్లో స్థానిక ఎమ్మెల్యేల ఏకపక్ష నిర్ణయాల వల్లే ఓటమి ఎదురైందని క్యాడర్ అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఓటమి పాలైన చోట్ల లోపాలను సరిదిద్దుకుంటామని చంద్రబాబు స్పష్టం చేయగా, పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన నేతలపై కఠిన చర్యలు ఉంటాయని మంత్రి నారా లోకేశ్ హెచ్చరించారు.మొత్తంమీద, ఎన్నికల ఫలితాలు పార్టీ శ్రేణుల్లో అధికారం పట్ల ఆత్మవిశ్వాసాన్ని పెంచినప్పటికీ, పొత్తు ధర్మం పేరుతో స్థానిక స్థాయిలో అవకాశాలు కోల్పోతున్నామనే భావన కొంతమంది నేతలు, కార్యకర్తల్లో అసంతృప్తికి కారణమవుతోంది.

హాట్ వార్నింగ్...వైసీపీకి బూమరాంగ్ ?



వైసీపీ అధినేత జగన్ సహా ఆ పార్టీ నేతలు 2029లో అధికారంలోకి వస్తే తమను ఇబ్బంది పెట్టిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. డిజిటల్ బుక్‌లో పేర్లు నమోదు చేస్తున్నామని చెబుతున్నారు. ఈ వ్యాఖ్యలు క్యాడర్‌లో ఉత్సాహం నింపుతున్నా, ప్రజల్లో మాత్రం కక్ష సాధింపు రాజకీయాలపై చర్చకు దారితీస్తున్నాయి. అభివృద్ధి అజెండాతో ప్రజల ముందుకు రావడమే వైసీపీకి మేలని రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం.

వైసీపీ అధినేత మాజీ సీఎం వైఎస్ జగన్ నుంచి ఆ పార్టీ మాజీ మంత్రులు కీలక నేతలు అంతా ఒక్కటే మాట అంటున్నారు. వైసీపీ క్యాడర్ ని ఇబ్బందులు పెడితే చూస్తూ ఊరుకోమని తమ ప్రభుత్వం వస్తే చర్యలు ఘాటుగా ఉంటాయని కూడా హెచ్చరిస్తున్నారు. వైసీపీ డిజిటల్ బుక్ ని కూడా ఏర్పాటు చేసింది. తమ మీద ఎవరైతే దాడులు చేసి ఇబ్బంది పెడతారో వారి పేర్లను నమోదు చేసి తాము అధికారంలోకి వస్తే తప్పకుండా రిటర్న్ గిఫ్ట్ ఇస్తామని అంటోంది. ఇది చెప్పడానికి వైసీపీ నేతలలో క్యాడర్ లో బూస్టింగ్ కలగచేయడానికి బాగానే ఉంటోంది. కానీ జన సామాన్యంలోకి వేరే సౌండ్ వెళ్తోంది అని అంటున్నారు.

అధికారం ఎందుకోసం :

ఏ రాజకీయ పార్టీ అయినా అధికారం ఎందుకు కోరుకుంటుంది అన్నది చూస్తే ప్రజలకు మేలు చేయాలని జవాబు వస్తుంది. తాము ఫలానా పథకాలు ఇస్తామని ప్రాజల జీవన ప్రమాణాలు మెరుగు పరుస్తామని తమ డెవలప్మెంట్ రోడ్ మ్యాప్ ఇది అని ఇలా అనేక రకాలుగా జనాలకు చెప్పి మెప్పించి ఒప్పించి అధికారంలోకి రావాలనుకుంటారు. కానీ వైసీపీ విషయం చూస్తే 2029 లో అధికారంలోకి వస్తే రాజకీయ ప్రత్యర్థుల సంగతి తేలుస్తామని అంటోంది. అలాగే తమను ఇబ్బందుల పాలు చేసిన అధికారులు పోలీసులు రిటైర్ అయినా దేశాలు దాటినా సప్త సముద్రాలు అవతల ఉన్నా సరే తెచ్చి మరీ చట్ట ప్రకారం శిక్షిస్తామని అంటోంది. ఇక్కడ చట్ట ప్రకారం అన్న మాట వాడటం వరకూ వైసీపీ జాగ్రత్త పడినా ఈ శిక్షలు ఏమిటి అన్నది జనంలో అయితే చర్చగా పోతోంది అని అంటున్నారు.

కక్ష సాధింపులేనా :

ఆ పార్టీ వస్తే ఈ పార్టీ నేతల అరెస్టులు, అలాగే ఒక సెక్షన్ ఆఫ్ అధికారులు ఐఏఎస్ ఐపీఎస్ అధికారులు లూప్ లైన్ లోకి నెట్టడం, అలాగే తమ అధికార హవా చూపించడం, దూకుడుగా రాజకీయం చేయడం ఇలాగే సాగుతోంది. జనాలు ఇదేనా కోరుకుంటారు అన్నది అతి పెద్ద ప్రశ్నగా ముందుకు వస్తోంది. రాజకీయాల్లో ప్రత్యర్థులుగా ఉన్న పార్టీలు విధానపరమైన అంశాలలో పోటీ పడాలి, వారి కంటే మేము ఇంకా ఎక్కువ మేలు చేస్తామని చెప్పాలి. అలా జనం వద్ద మంచి మార్కులు కొట్టేయాలి. కానీ వారు రెడ్ బుక్ అంటే మేము డిజిటల్ బుక్ ని తెస్తామని చెబుతూంటే జనాలకు ఇదేదో రోతగా ఉండదా అని కూడా చర్చ సాగుతోంది.

సీనియర్ నేతలు సైతం :

ఇక చూస్తే సీనియర్ నేతలు సైతం ఇదే రకంగా మాట్లాడుతున్నారని అంటున్నారు. మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ అయితే చుక్కలు చూపిస్తామని తాజాగా విజయనగరం వైసీపీ సమావేశంలో మాట్లాడుతూ గట్టిగానే చెప్పారు. ఇపుడున్న రాజకీయం సరిపోదని మైండ్ సెట్ మార్చుకోవాల్సిందే అన్నారు. అలాగే స్థానిక ఎన్నికల సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్ రెడ్డి ఆవేశంతో చేసిన కామెంట్స్ కూడా చర్చకు వచ్చాయి. తమ ప్రభుత్వం వస్తే ఎవరినీ వదిలిపెట్టేది లేదని ఇలా వైసీపీ నేతలు ఇస్తున్న వార్నింగులు క్యాడర్ కి అయితే నూరు శాతం హుషారు ఇస్తున్నాయి, ఇందులో సందేహం అయితే లేదు, కానీ అదే సమయంలో జనసామాన్యంలో మాత్రం ఎంతసేపూ కక్షలేనా అన్న మాట వినిపిస్తోంది.

అభివృద్ధి అజెండాతో :

ఇక ఎన్నికలు చూస్తే రెండున్నరేళ్ళ వ్యవధిలోకి వచ్చేశాయి. వైసీపీ కూడా అభివృద్ధి అజెండాతో జనం ముందుకు రావాలని కోరుతున్నారు. అలాగే తాము ఏమి చేస్తామన్నది కూడా చెప్పుకోవాలని అంటున్నారు. ఏపీ చూస్తే ఈ రోజుకీ అనేక రకాలైన నష్టాలతో కష్టాలతో ఉంది. విభజన గాయాలు ఇప్పటికీ అలాగే ఉన్నాయి. ప్రజలు అయితే మంచి జరగాలని ఆకాంక్షిస్తున్నారు. వైసీపీ పరకూ చూస్తే రాజకీయంగా తమను ఇబ్బంది పెడుతున్న ప్రత్యర్థుల మీద విమర్శలు చేయవద్దని ఎవరూ అనడంలేదు. అదే సమయంలో ప్రజలకు కూడా తాము ఏమి చేస్తామో చెబుతూ ఉంటే ఆ పార్టీకే మేలు అని అంటున్నారు.

సంపాదకీయం


కొత్త శాంతిమంత్రం!

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ఒకే వేదికపై సమావేశం కాబోతున్నారన్న వార్త అంతర్జాతీయంగా ఆసక్తిని రేకెత్తిస్తోంది. చైనాలోని షెన్‌జెన్‌లో నవంబర్ 19న ఈ త్రైపాక్షిక భేటీ జరగనుంది. చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి మావో నింగ్ సమావేశానికి చారిత్రక ప్రాధాన్యం ఉంటుందని, మూడు దేశాల మధ్య సమాచార మార్పిడి, విభేదాల నిర్వహణ, సంబంధాల స్థిరీకరణకు దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రపంచ రాజకీయ, ఆర్థిక, సైనిక సమీకరణాలను ప్రభావితం చేయగల మూడు అగ్రశక్తులు ఒకే టేబుల్ వద్ద కూర్చోవడం వెనుక అనేక వ్యూహాత్మక ప్రయోజనాలు దాగి ఉన్నాయి. ముఖ్యంగా అణ్వాయుధాల నియంత్రణ, ఇరాన్ పరిణామాలు, అంతర్జాతీయ భద్రత, వాణిజ్య సంబంధాలు ఈ భేటీలో ప్రాధాన్యం సంతరించుకోనున్నాయి. ట్రంప్ ప్రధానంగా ప్రపంచవ్యాప్తంగా అణ్వాయుధాల సంఖ్యను తగ్గించే అంశాన్ని చర్చించాలనుకుంటున్నట్లు వైట్‌హౌస్ వెల్లడించింది. ఇరాన్‌కు సంబంధించిన పరిణామాలపైనా చర్చించే అవకాశం ఉంది. అయితే ఉక్రెయిన్ యుద్ధాన్ని ఈ సమావేశంలో ప్రస్తావించే ఉద్దేశం లేదని అమెరికా అధికారులు చెబుతున్నారు. అమెరికా, రష్యా మధ్య ఈ అంశంపై ప్రత్యేక చర్చలు కొనసాగుతున్నందున, చైనా భాగస్వామ్యం లేని ఆ చర్చలను ఈ వేదికపైకి తీసుకురావడం సరైనది కాదన్నది వాషింగ్టన్ అభిప్రాయం.

సమావేశంలో అత్యంత కీలకమైన అంశం అణ్వాయుధ నియంత్రణ. ప్రపంచంలో అత్యధిక అణ్వాయుధ నిల్వలు కలిగిన దేశాలుగా అమెరికా, రష్యా ముందున్నాయి. చైనా కూడా ఇటీవలి సంవత్సరాల్లో తన అణ్వాయుధ సామర్థ్యాన్ని వేగంగా విస్తరిస్తోంది. ఇప్పటివరకు అమెరికా, రష్యా మధ్య అణ్వాయుధాల సంఖ్యను పరిమితం చేయడానికి కీలకంగా పనిచేసిన 'న్యూ స్టార్ట్' ఒప్పందం 2026 ఫిబ్రవరి 5తో ముగిసిపోయింది. దీంతో ఐదు దశాబ్దాలకు పైగా కొనసాగిన అమెరికా–రష్యా అణ్వాయుధ నియంత్రణ వ్యవస్థలో కీలకమైన ఒప్పందపరమైన పరిమితులు తొలగిపోయాయి. ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ సైతం ఈ పరిణామంపై ఆందోళన వ్యక్తం చేస్తూ, రెండు దేశాలు కొత్త ఒప్పందానికి రావాలని పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో అణ్వాయుధాల నియంత్రణకు చైనా భాగస్వామ్యం కూడా అవసరమని ట్రంప్ భావిస్తున్నారు. అయితే అమెరికా, రష్యాల అణ్వాయుధ నిల్వలతో పోలిస్తే చైనా నిల్వలు తక్కువగా ఉన్నందున, సమాన స్థాయిలో ఆయుధ నియంత్రణ చర్చల్లో పాల్గొనడం తమకు సమంజసం కాదన్నది బీజింగ్ అభిప్రాయం. అణ్వాయుధ నియంత్రణ అనేది కేవలం ఆయుధాల సంఖ్యను తగ్గించడంతో పూర్తయ్యే ప్రక్రియ కాదు. వాటి తయారీ, నిల్వలు, ప్రయోగ వ్యవస్థలు, పర్యవేక్షణ, పరస్పర నమ్మకంవంటి అంశాలూ ఇందులో కీలకం. ముఖ్యంగా ఉక్రెయిన్ యుద్ధం కారణంగా దెబ్బతిన్న అమెరికా–రష్యా నమ్మకాన్ని తిరిగి నిర్మించుకోవాల్సి ఉంది. అందువల్ల ఈ సమావేశంలోనే కొత్త అణ్వాయుధ ఒప్పందం కుదిరే అవకాశాలు తక్కువగా ఉన్నాయని అమెరికా సీనియర్ అధికారి ఒకరు స్పష్టం చేసినట్లు వార్తా సంస్థలు వెల్లడించాయి. అయినప్పటికీ మూడు దేశాల అధినేతలు ఈ అంశంపై నేరుగా మాట్లాడుకోవడం చిన్న పరిణామం కాదు, ప్రపంచ శాంతికి సానుకూల పరిణామమే.

ఇక ఈ సమావేశం వెనుక మరో ముఖ్యమైన కోణం అంతర్జాతీయ ఆధిపత్య పోరు. అమెరికా, చైనా మధ్య వాణిజ్యం, సాంకేతిక పరిజ్ఞానం, కృత్రిమ మేధ (ఏఐ), తైవాన్ వంటి అంశాల్లో విభేదాలు కొనసాగుతున్నాయి. మరోవైపు ఉక్రెయిన్‌పై యుద్ధం ప్రారంభమైన తర్వాత రష్యా పాశ్చాత్య దేశాల ఆంక్షలను ఎదుర్కొంటోంది. ఈ పరిస్థితుల్లో చైనా రష్యాకు కీలకమైన వాణిజ్య భాగస్వామిగా మారింది. రష్యా నుంచి చమురు, సహజ వాయువు దిగుమతులు చేసుకుంటూ తన ఇంధన అవసరాలను తీర్చుకుంటోంది. అదే సమయంలో అమెరికా కూడా చైనాతో సంబంధాలను పూర్తిగా దెబ్బతీసుకోకుండా వాణిజ్య, దౌత్యపరమైన చర్చలకు ప్రాధాన్యం ఇస్తోంది. ఇరాన్ అంశం కూడా ఈ భేటీలో కీలకంగా మారవచ్చు. ఇరాన్ చమురు దిగుమతుల్లో చైనా కీలక పాత్ర పోషిస్తున్నందున, ఈ అంశంపై మూడు దేశాల మధ్య జరిగే చర్చలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుంది. అయితే ఈ సమావేశం వల్ల వెంటనే యుద్ధాలు ఆగిపోతాయని, ఆర్థిక ఆంక్షలు తొలగిపోతాయని లేదా కొత్త అణ్వాయుధ ఒప్పందం కుదిరిపోతుందని ఆశించడం వాస్తవిక దృక్పథం కాదు. అసలు ఈ భేటీని ఒప్పందాల వేదికగా కాకుండా, పరస్పర ప్రయోజనాలను అర్థం చేసుకునే తొలి ప్రయత్నంగా చూడాలి. అమెరికా తన భద్రతా ప్రయోజనాలను కాపాడుకోవాలనుకుంటుంది. రష్యా అంతర్జాతీయంగా తన ప్రాధాన్యాన్ని తిరిగి నిలబెట్టుకోవాలని చూస్తోంది. చైనా ప్రపంచ రాజకీయాల్లో తన ప్రభావాన్ని మరింత విస్తరించుకోవాలని భావిస్తోంది. ఈ మూడు లక్ష్యాల మధ్య సమతుల్యత సాధించడం అంత తేలికైన పని కాదు. అయినప్పటికీ ప్రపంచ శాంతి, అణ్వాయుధ నియంత్రణ, ఆర్థిక స్థిరత్వం వంటి అంశాల్లో ఈ దేశాలు కనీస ఏకాభిప్రాయానికి రావడం అత్యవసరం. ఎందుకంటే ఈ మూడు దేశాల మధ్య తలెత్తే విభేదాల ప్రభావం ఆసియా, యూరప్, మధ్యప్రాచ్యం సహా ప్రపంచంలోని అనేక ప్రాంతాలపై పడుతుంది. ముఖ్యంగా భారత్‌కు ఈ పరిణామాలు ఎంతో కీలకం. అమెరికాతో వ్యూహాత్మక భాగస్వామ్యం, రష్యాతో సంప్రదాయ రక్షణ సంబంధాలు, చైనాతో సరిహద్దు సమస్యలు, వాణిజ్య అవసరాలు.. ఇలా భారత్‌కు ఈ మూడు దేశాలతోనూ విభిన్న ప్రయోజనాలు ఉన్నాయి. అందువల్ల ఈ అగ్రనేతల మధ్య సంబంధాలు ఎలా మారుతున్నాయన్నది భారత్ నిశితంగా గమనించాల్సిన అంశం. ఈ సమావేశం ద్వారా ప్రపంచ దేశాలకు ఒక స్పష్టమైన సందేశం వెళ్లాలి. అణ్వాయుధాలు పెంచుకోవడంలో కాదు.. వాటి వినియోగాన్ని నివారించడంలోనే నిజమైన శక్తి ఉంది. ఆధిపత్య పోరులో కాదు.. పరస్పర సహకారంలోనే ప్రపంచ భవిష్యత్తు ఉంది. ముగ్గురు నేతలు ఒకే వేదికపై కూర్చోవడం చరిత్ర కావచ్చు. కానీ ఆ వేదికపై తీసుకునే నిర్ణయాలు కోట్లాది మంది ప్రజల భవిష్యత్తును ప్రభావితం చేయగలవు. కాబట్టి ఈ భేటీ ఫొటోలు, ప్రకటనలు, రాజకీయ ప్రదర్శనలకే పరిమితం కాకుండా.. అణ్వాయుధ నియంత్రణ, యుద్ధాల నివారణ, అంతర్జాతీయ భద్రత దిశగా ఆచరణాత్మక అడుగులకు నాంది కావాలి. అదే ఈ చారిత్రక సమావేశం నుంచి ప్రపంచం ఆశిస్తున్న అసలైన ఫలితం.

పనికొచ్చే పలుకు



నాలుగు అడుగులేద్దాం!

మనిషి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి పెద్దగా ఖర్చు పెట్టాల్సిన అవసరం లేదు. ఖరీదైన ఆహార పదార్థాలు, గంటల తరబడి వ్యాయామాలు, కఠినమైన డైట్ ప్లాన్లు మాత్రమే ఆరోగ్యానికి మార్గాలు కావు. మన రోజువారీ జీవితంలో చిన్నచిన్న మార్పులు చేసుకున్నా అద్భుతమైన ఫలితాలు పొందవచ్చు. అలాంటి సులభమైన, ప్రభావవంతమైన అలవాట్లలో ఒకటి భోజనం చేసిన తర్వాత పది నుంచి పదిహేను నిమిషాల పాటు నడక. వినడానికి చిన్న విషయంలా అనిపించినా.. ఇది శరీరానికి ఎన్నో విధాలుగా మేలు చేస్తుంది.

సాధారణంగా చాలామందికి భోజనం చేసిన వెంటనే కాసేపు కూర్చోవడం, సోఫాలో వాలిపోవడం, లేదంటే నిద్రపోవడం అలవాటు. ముఖ్యంగా మధ్యాహ్న భోజనం తర్వాత బద్ధకంగా అనిపించడం సహజం. కానీ అదే సమయంలో మన శరీరంలో ఆహారం జీర్ణమయ్యే ప్రక్రియ మొదలవుతుంది. మనం తీసుకున్న ఆహారంలోని కార్బోహైడ్రేట్లు గ్లూకోజ్‌గా మారి రక్తంలోకి చేరతాయి. ఈ సమయంలో రక్తంలో చక్కెరస్థాయిలు పెరుగుతాయి. అయితే భోజనం తర్వాత కొద్దిసేపు నడవడంవల్ల కండరాలు చురుగ్గా పనిచేసి రక్తంలోని గ్లూకోజ్‌ను శక్తిగా ఉపయోగించుకోవడానికి సహాయపడతాయి. ఫలితంగా భోజనం తర్వాత రక్తంలో చక్కెర స్థాయిలు ఒక్కసారిగా పెరిగే పరిస్థితిని కొంతవరకు నియంత్రించవచ్చు.

భోజనం చేసిన తర్వాత కడుపు బరువుగా అనిపించడం, గ్యాస్, ఉబ్బరంవంటి సమస్యలు చాలామందిని ఇబ్బంది పెడుతుంటాయి. ఇలాంటి సందర్భాల్లో నెమ్మదిగా నడవడం ఉపయోగపడుతుంది. శరీర కదలికలు జీర్ణవ్యవస్థ పనితీరుకు తోడ్పడతాయి. అంతేకాదు, భోజనం తర్వాత వచ్చే బద్ధకం తగ్గి శరీరంలో చురుకుదనం పెరుగుతుంది. అయితే నడక మరీ వేగంగా ఉండకూడదు. తిన్న వెంటనే పరుగెత్తడం, కఠినమైన వ్యాయామాలు చేయడం అవసరం లేదు. ప్రశాంతంగా, హాయిగా అడుగులు వేస్తే సరిపోతుంది.

మనలో చాలామంది ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని అనుకుంటారు. కానీ సమయం లేదని, పని ఒత్తిడి ఉందని, వ్యాయామానికి బద్ధకమని వాయిదా వేస్తుంటారు. వాస్తవానికి ఆరోగ్యకరమైన జీవనశైలి అంటే రోజులో గంటల తరబడి వ్యాయామం చేయడం మాత్రమే కాదు. మనకు అందుబాటులో ఉన్న సమయాన్ని సరిగ్గా ఉపయోగించుకోవడం కూడా. ఉదయం అల్పాహారం తర్వాత, మధ్యాహ్న భోజనం తర్వాత, రాత్రి భోజనం తర్వాత వీలైనంతవరకు పది నిమిషాలు నడవడానికి ప్రయత్నించండి. రోజుకు మూడుసార్లు ఇలా నడిస్తే అదనంగా అరగంట శారీరక చలనం లభిస్తుంది. అయితే మీ శారీరక పరిస్థితిని బట్టి సమయాన్ని, వేగాన్ని నిర్ణయించుకోవాలి.

ఆరోగ్యం ఒక్కరోజులో సంపాదించేది కాదు. అలాగే ఒక్కరోజులో కోల్పోయేది కూడా కాదు. మనం ప్రతిరోజూ చేసే చిన్నచిన్న పనులే భవిష్యత్తులో మన ఆరోగ్యాన్ని నిర్ణయిస్తాయి. అందుకే రేపటి నుంచి కాదు.. ఈరోజు నుంచే ఓ మంచి అలవాటుకు శ్రీకారం చుట్టండి. భోజనం చేసిన వెంటనే ఫోన్ పట్టుకుని కూర్చోవడం కంటే పది నిమిషాలు నడవడానికి ప్రాధాన్యత ఇవ్వండి. వాహనం దగ్గరే ఉన్నా కొద్దిదూరం నడవండి. లిఫ్ట్‌కు బదులుగా మెట్లు ఎక్కే అవకాశం ఉంటే ప్రయత్నించండి.

గుర్తుంచుకోండి.. ఆరోగ్యంగా ఉండటానికి ప్రతిసారీ పెద్ద పెద్ద నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం లేదు. మన రోజువారీ అలవాట్లలో చిన్న మార్పులు చేసుకుంటే చాలు. మీ ఆరోగ్యం కోసం మీరు కేటాయించే ఆ పది నిమిషాలు.. మీ జీవితానికి మరింత ఆరోగ్యాన్ని, ఉత్సాహాన్ని అందించగలవు.


డిజిటల్ ప్రపంచానికి హెచ్చరిక!



ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది ఉపయోగించే మైక్రోసాఫ్ట్ సేవలు ఒక్కసారిగా నిలిచిపోతే పరిస్థితి ఎలా ఉంటుందో ఇటీవల ఎదురైన అంతరాయం స్పష్టం చేసింది. మైక్రోసాఫ్ట్ 365లో భాగమైన ఔట్‌లుక్, టీమ్స్‌తో పాటు కృత్రిమ మేధ సహాయక వ్యవస్థ కోపైలట్ సేవలు సైతం గంటల తరబడి అందుబాటులో లేకపోవడంతో ప్రభుత్వ కార్యాలయాలు, న్యాయస్థానాలు, ఆసుపత్రులు, బ్యాంకులు, విమానయాన సంస్థలు, వ్యాపార సంస్థలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాయి. అమెరికాలో గురువారం మధ్యాహ్నం ప్రారంభమైన ఈ సమస్య శుక్రవారం వరకు కొనసాగగా, శనివారం నాటికి సేవలన్నీ పూర్తిగా పునరుద్ధరించినట్లు మైక్రోసాఫ్ట్ ప్రకటించింది. డౌన్‌డిటెక్టర్ అనే ఆన్‌లైన్ అంతరాయాల పర్యవేక్షణ సంస్థకు 70కి పైగా దేశాలు, ప్రాంతాల నుంచి ఫిర్యాదులు అందాయి. ప్రపంచవ్యాప్తంగా 430 మిలియన్లకు పైగా ప్రజలు మైక్రోసాఫ్ట్ 365 సేవలను ఉపయోగిస్తున్నారన్న విషయం ఈ అంతరాయం తీవ్రతను తెలియజేస్తోంది. నెట్‌వర్క్ సామర్థ్యాన్ని పెంచేందుకు గతంలో చేపట్టిన అప్‌గ్రేడ్ ప్రక్రియలో ఏర్పడిన సాంకేతిక లోపం, ఇటీవల జరిగిన నెట్‌వర్క్ మార్పు తర్వాత బయటపడినట్లు మైక్రోసాఫ్ట్ వివరించింది. అయితే సమస్యను గుర్తించిన వెంటనే పరిష్కరించడం సాధ్యం కాలేదు. కొన్ని సర్వర్లు అనూహ్యంగా అందుబాటులో లేకపోవడంతో సేవల పునరుద్ధరణకు సమయం పట్టింది. ఔట్‌లుక్‌లో ఈమెయిల్స్ పంపడం, స్వీకరించడం, ఇన్‌బాక్స్ తెరవడం వంటి సాధారణ పనులు కూడా నిలిచిపోయాయి. బ్రిటన్‌లోని మాంచెస్టర్ న్యాయస్థానంలో విచారణకు అంతరాయం ఏర్పడటంతో న్యాయమూర్తి జ్యూరీ సభ్యులను ఇళ్లకు పంపించారు. పోలీసులు ఆన్‌లైన్‌లో నేర ఫిర్యాదులు స్వీకరించలేక అత్యవసర పరిస్థితుల్లో ఫోన్ ద్వారా సంప్రదించాలని ప్రజలకు సూచించారు. అమెరికాలోని కొన్ని ప్రాంతాల్లోనూ పోలీసు శాఖల ఆన్‌లైన్ సేవలు ప్రభావితమయ్యాయి. జపాన్, సింగపూర్, ఆస్ట్రేలియా ప్రభుత్వ కార్యకలాపాలపైనా ఈ అంతరాయం ప్రభావం చూపింది. అంటే ఒక సాంకేతిక సంస్థలో తలెత్తిన సమస్య ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు రంగాల కార్యకలాపాలను నిలిపివేయగలదని ఈ ఘటన నిరూపించింది.

ఈ పరిణామాన్ని కేవలం మైక్రోసాఫ్ట్ సంస్థ ఎదుర్కొన్న సాంకేతిక సమస్యగా మాత్రమే చూడటం సరైనది కాదు. ఆధునిక ప్రపంచం తన రోజువారీ కార్యకలాపాల కోసం కొద్దిమంది అంతర్జాతీయ సాంకేతిక సంస్థల సేవలపై ఎంతగా ఆధారపడిపోయిందో ఇది తెలియజేస్తోంది. ఒకప్పుడు కార్యాలయాల నిర్వహణకు సొంత సర్వర్లు, స్థానిక కంప్యూటర్ వ్యవస్థలు, ప్రత్యేక సమాచార నెట్‌వర్క్‌లు ఉండేవి. ఇప్పుడు వాటిలో చాలా సేవలు క్లౌడ్ ఆధారితంగా మారాయి. దీనివల్ల ఖర్చులు తగ్గడం, ఎక్కడి నుంచైనా సమాచారాన్ని పొందడం, ఉద్యోగులు వేగంగా పనిచేయడం, భారీస్థాయిలో డేటాను భద్రపరచడం సాధ్యమవుతోంది. చిన్న సంస్థల నుంచి ప్రభుత్వ విభాగాల వరకు ఈ సౌకర్యాలను ఉపయోగించుకుంటున్నాయి. అయితే ఈ సౌలభ్యం వెనుక ఒక కీలకమైన ప్రమాదం కూడా ఉంది. ఒకే సంస్థకు చెందిన ఈమెయిల్, డాక్యుమెంట్లు, సమావేశాలు, డేటా నిల్వ వంటి అనేక సేవలను ఒకేసారి ఉపయోగిస్తే, ఆ సంస్థ మౌలిక సదుపాయాల్లో ఏర్పడే ఒక్క లోపం కూడా అనేక రంగాలను ప్రభావితం చేయగలదు. దీనినే సాంకేతిక రంగంలో 'వెండర్ కాన్సంట్రేషన్ రిస్క్'గా పేర్కొంటారు. అంటే కీలకమైన సేవలన్నింటినీ ఒకే సంస్థకు అప్పగించడం వల్ల ఏర్పడే వ్యవస్థాగత ప్రమాదం. ఈ నేపథ్యంలో సంస్థలు తమ డిజిటల్ మౌలిక సదుపాయాలపై ఆధారపడే విధానాన్ని పునఃపరిశీలించాల్సిన అవసరం ఉంది. ఒకే క్లౌడ్ సంస్థపై పూర్తిగా ఆధారపడకుండా, అవసరమైన చోట ప్రత్యామ్నాయ సేవలను సిద్ధం చేసుకోవాలి. కీలక సమాచారానికి స్వతంత్ర బ్యాకప్‌లు నిర్వహించాలి. ఒక ప్రాంతంలో సాంకేతిక సమస్య తలెత్తితే మరో ప్రాంతం నుంచి సేవలు కొనసాగించే ఏర్పాట్లు ఉండాలి. అయితే రెండు మూడు క్లౌడ్ సేవలను ఒకేసారి నిర్వహించడం ప్రతి సంస్థకూ సాధ్యం కాకపోవచ్చు. దానికి అదనపు ఖర్చులు, సాంకేతిక నైపుణ్యం అవసరమవుతాయి. అయినప్పటికీ ఆసుపత్రులు, న్యాయస్థానాలు, బ్యాంకింగ్, అత్యవసర సేవల విషయంలో ఖర్చు తగ్గించుకోవడమే ఏకైక లక్ష్యం కాకూడదు. డిజిటల్ వ్యవస్థలు పనిచేయని సందర్భంలోనూ కనీస కార్యకలాపాలు కొనసాగించే ప్రత్యామ్నాయ విధానాలు ఉండాలి. సాంకేతికతపై నమ్మకం అవసరమే కానీ, అది ఆధారపడటంగా మారకూడదు.

భారత్ వంటి వేగంగా డిజిటలైజేషన్ దిశగా పయనిస్తున్న దేశానికి ఈ ఘటన మరింత ప్రాధాన్యం కలిగినది. ప్రభుత్వ సేవలు, బ్యాంకింగ్, విద్య, ఆరోగ్యం, వ్యాపార లావాదేవీలు, సమాచార మార్పిడి.. ఇలా దాదాపు ప్రతి రంగంలోనూ డిజిటల్ వ్యవస్థల వినియోగం పెరుగుతోంది. ప్రభుత్వ కార్యాలయాల నుంచి చిన్న వ్యాపార సంస్థల వరకు క్లౌడ్ సేవలు, ఆన్‌లైన్ సాఫ్ట్‌వేర్ వేదికలపై ఆధారపడుతున్నాయి. ఈ మార్పు అభివృద్ధికి అవసరమైనదే అయినప్పటికీ, దానికి అనుగుణంగా భద్రత, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా అభివృద్ధి చెందాలి. ఒక విదేశీ సంస్థకు చెందిన సేవలు నిలిచిపోతే భారతదేశంలోని సంస్థలు తమ కార్యకలాపాలను కొనసాగించలేని పరిస్థితి రాకూడదు. ఇందుకోసం కీలకమైన సమాచారానికి స్థానిక బ్యాకప్‌లు, ప్రత్యామ్నాయ కమ్యూనికేషన్ మార్గాలు, అవసరమైనప్పుడు ఇంటర్నెట్ లేకుండానే పనిచేసే వ్యవస్థలు సిద్ధంగా ఉండాలి. సంస్థలు తమ సాంకేతిక సేవల ఒప్పందాల్లో అంతరాయాలకు సంబంధించిన నిబంధనలను కూడా స్పష్టంగా తెలుసుకోవాలి. సేవలు నిలిచిపోయినప్పుడు ఎవరు బాధ్యత వహిస్తారు? ఎంత సమయంలో వాటిని పునరుద్ధరించాలి? వినియోగదారుల సమాచార భద్రతకు ఎలాంటి హామీలు ఉంటాయి? అనే అంశాలపై ముందుగానే స్పష్టత అవసరం. అంతేకాదు, అత్యవసర పరిస్థితుల్లో ప్రధాన డిజిటల్ వ్యవస్థ పనిచేయకపోతే ప్రత్యామ్నాయ విధానాలను ఎలా అమలు చేయాలో ఉద్యోగులకు శిక్షణ ఇవ్వాలి. సాంకేతిక సంస్థలు కూడా సమస్యలు తలెత్తినప్పుడు పారదర్శకంగా వ్యవహరించాలి. అంతరాయానికి కారణం ఏమిటి? ఏ సేవలు ప్రభావితమయ్యాయి? సమస్య పరిష్కారానికి ఎంత సమయం పడుతుంది? అనే వివరాలను ఎప్పటికప్పుడు తెలియజేయాలి. భవిష్యత్తులో కృత్రిమ మేధ వినియోగం పెరిగేకొద్దీ డిజిటల్ వ్యవస్థలపై ఆధారపడటం మరింత విస్తరించే అవకాశం ఉంది. అందువల్ల సాంకేతిక అభివృద్ధితోపాటు వ్యవస్థల స్థిరత్వానికి కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలి. డిజిటల్ ప్రపంచంలో వేగం ఎంత ముఖ్యమో, అంతరాయం వచ్చినా నిలబడగల సామర్థ్యం అంతకంటే ముఖ్యం. మైక్రోసాఫ్ట్ సేవలు తిరిగి అందుబాటులోకి రావడంతో తక్షణ సమస్య పరిష్కారమైనప్పటికీ, ఈ ఘటన లేవనెత్తిన ప్రశ్నలు మాత్రం ఇంకా మిగిలే ఉన్నాయి. ఒక సంస్థలో ఏర్పడిన సాంకేతిక లోపం ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాలను, వ్యాపారాలను, సామాన్య ప్రజలను ప్రభావితం చేసే పరిస్థితి కొనసాగాలా? లేక మరింత స్వతంత్రంగా, ప్రత్యామ్నాయాలతో కూడిన డిజిటల్ వ్యవస్థలను నిర్మించుకోవాలా? అన్నది ప్రతి దేశం, ప్రతి సంస్థ ఆలోచించాల్సిన అంశం. సాంకేతికత మన జీవితాలను సులభతరం చేయాలి.. కానీ ఒకే సాంకేతిక వ్యవస్థ పనిచేయకపోతే మన జీవితాలే ఆగిపోయే పరిస్థితి మాత్రం రాకూడదు. అదే ఈ అంతర్జాతీయ అంతరాయం ప్రపంచానికి నేర్పిన అసలైన పాఠం. ■



చాలామంది తమకు జీవితంలో నిజంగా ఏం కావాలో తెలుసుకోకుండానే కాలాన్ని గడిపేస్తుంటారు. ఇతరులను ఆకట్టుకోవడానికి లక్ష్యాలు పెట్టుకుంటారు. నలుగురూ నడిచిన దారిలోనే తాము కూడా నడుస్తుంటారు. కానీ చివరకు ఆశించిన ఆనందం మాత్రం దక్కదు. ఎందుకంటే మనసుకు నచ్చిన జీవితం వేరు.. ఇతరులకు నచ్చేలా బతకడం వేరు. అందుకే ముందుగా మీకు ఏం కావాలో, ఏది సంతోషాన్నిస్తుందో తెలుసుకోండి. మీ గమ్యంపై స్పష్టత ఉంటే ప్రయాణం సులభమవుతుంది. మీ జీవితం మీది.. మీ నిర్ణయాలు కూడా మీవే కావాలి.

-మహాదేవ

వింతల్లో వింతలు

65 లక్షల ఏళ్ల నాటి ఏనుగు దవడా!?



మధ్యప్రదేశ్‌లోని రైసెన్ జిల్లాలో నర్మదా నది ఒడ్డున భారీ జంతువు దవడను పోలిన వింత నిర్మాణం బయటపడింది. పతై గ్రామం సమీపంలో పిల్లలు మట్టి తవ్వుతుండగా కనిపించిన ఈ ఆకారంలో మొత్తం 18 దంతాల్లాంటి నిర్మాణాలు ఉన్నాయి. ఇది సుమారు 65 లక్షల ఏళ్ల నాటి ప్రాచీన ఏనుగు జాతి శిలాజం కావచ్చని నిపుణులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. అంతరించిపోయిన స్టెగోడాన్ నమాడికస్ జాతికి చెందినదై ఉండొచ్చని భావిస్తున్నారు. మరోవైపు స్థానికులు దీనిని దైవ స్వరూపంగా భావించి పూజలు చేస్తున్నారు. పూర్తి పరిశీలన తర్వాతే దీని అసలు చరిత్ర వెల్లడికానుంది.

సచిన్‌తో గల్లీ క్రికెట్ ఆడిన బ్రిటన్ రాజదంపతులు!

- ముంబైలో చిన్నారులతో కలిసి సందడి చేసిన విలియం, కేట్
- బౌలింగ్ చేసిన యువరాజు.. బ్యాట్ పట్టిన కేట్
- పదేళ్ల తర్వాత మరోసారి సచిన్‌తో క్రికెట్
- ఆట అనంతరం సంప్రదాయ కుల్హడ్ చాయ్ ఆస్వాదన



బ్రిటన్ యువరాజు ప్రిన్స్ విలియం, ఆయన భార్య కెట్ మిడిల్టన్ భారత్ పర్యటనకు వచ్చారు. 3 రోజుల పర్యటనలో భాగంగా సోమవారం ముంబైకి చేరుకున్న ఈ రాజదంపతులు.. క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్‌తో కలిసి గల్లీ క్రికెట్ ఆడారు. ఈ సందర్భంగా స్థానిక చిన్నారులతో సరదాగా గడిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ముంబైలోని బల్లార్డ్ ఎస్టేట్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రిన్స్ విలియం, కేట్‌తో పాటు సచిన్ టెండూల్కర్, భారత మాజీ మహిళా క్రికెటర్ పూనమ్ రౌత్ పాల్గొన్నారు. 'ది రైట్ పిచ్' అనే సంస్థ సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. క్రికెట్ ద్వారా యువతలో ఆత్మవిశ్వాసం పెంచడం, వారికి అవకాశాలు కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. ఈ సందర్భంగా ప్రిన్స్ విలియం బౌలింగ్ చేయగా.. కేట్ బ్యాటింగ్ చేశారు. స్థానిక పాఠశాలలకు చెందిన వందలాది మంది విద్యార్థులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. కొందరు రాజదంపతులతో కలిసి క్రికెట్ ఆడగా.. మరికొందరు పక్కన ఉండి ఆటను ఆస్వాదించారు. ప్రిన్స్ విలియం, కేట్ 2016లో భారత్‌లో పర్యటించినప్పుడు కూడా ముంబైలోని ఓవల్ మైదానంలో స్థానిక చిన్నారులతో క్రికెట్ ఆడారు. అప్పట్లోనూ సచిన్ టెండూల్కర్ వారితో కలిసి పాల్గొన్నారు. ఇప్పుడు పదేళ్ల తర్వాత మరోసారి సచిన్‌తో కలిసి క్రికెట్ ఆడటంతో ఈ కార్యక్రమం ప్రత్యేకంగా నిలిచింది. క్రికెట్ ఆడిన తర్వాత రాజదంపతులు సచిన్‌తో కలిసి సంప్రదాయ మట్టి కప్పుల్లో అందించే కుల్హడ్ చాయ్‌ను ఆస్వాదించారు. ప్రిన్స్ విలియం స్థాపించిన 'ఎర్తషాట్ ప్రైజ్' వార్షిక అవార్డుల కార్యక్రమంలో పాల్గొనేందుకు ఈ జంట భారత్‌కు వచ్చింది. నవంబర్ 17న జరగనున్న ఈ వేడుకలో పర్యావరణ పరిరక్షణకు వినూత్న పరిష్కారాలు చూపిన ఐదు ప్రాజెక్టులకు ఒక్కొక్కటి మిలియన్ పౌండ్ల చొప్పున బహుమతి అందించనున్నారు. బాలీవుడ్ దర్శకుడు కరణ్ జోహర్ ఈ వేడుకకు వ్యాఖ్యాతగా వ్యవహరించనున్నారు. అలియా భట్, సోనమ్ కపూర్, రామీ మాలెక్ వంటి ప్రముఖులు హాజరుకానున్నారు. గాయని శ్రేయా ఘోషల్, బ్రిటిష్ పాప్ బ్యాండ్ టేక్ దట్ సంగీత ప్రదర్శనలు ఇవ్వనున్నారు. రాజదంపతులు ఈ పర్యటనలో భాగంగా ముంబై మెట్రో ప్రయాణం, భారతీయ సినిమా, ఫ్యాషన్, పర్యావరణ ఆవిష్కరణలకు సంబంధించిన కార్యక్రమాల్లోనూ రాజదంపతులు పాల్గొంటారు. నవంబర్ 18న న్యూఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమైన తదుపరి వారి పర్యటన ముగియనుంది.



జై షా.. రెండోసారి


బాలి: అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) ఛైర్మన్‌గా జై షా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. క్రికెట్‌కు అత్యంత కీలక సమయం కావడంతో నాయకత్వ కొనసాగింపులో భాగంగా మరో రెండేళ్ల కాలానికి షాను ఛైర్మన్‌గా ఎన్నుకున్నట్లు ఐసీసీ సోమవారం ప్రకటించింది. గతంలో బీసీసీఐ కార్యదర్శిగా వ్యవహరించిన 38 ఏళ్ల షా.. 2024 డిసెంబరులో తొలిసారిగా ఐసీసీ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించాడు. ఈ పదవిని చేపట్టిన అత్యంత పిన్న వయస్కుడిగా షా రికార్డు సృష్టించాడు. "ఐసీసీ బోర్డు నాపై ఉంచిన నమ్మకాన్ని ఎంతో గౌరవంగా భావిస్తున్నా. ఐసీసీ ఛైర్మన్‌గా సేవలందించడం గొప్ప బాధ్యత. ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ ప్రయోజనాలను ముందుకు తీసుకెళ్లేందుకు సభ్య దేశాలతో కలిసి పనిచేస్తా. 2028 లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్‌లో క్రికెట్‌ను చేర్చడం ద్వారా ఆటను కొత్త ప్రేక్షకులకు చేరువ చేయడానికి.. నూతన తరం ఆటగాళ్లను ప్రోత్సహించడానికి అద్భుత అవకాశం లభించింది" అని షా పేర్కొన్నాడు. రెండోసారి ఛైర్మన్‌గా ఎన్నికైన షాకు భారత క్రికెట్ దిగ్గజం సచిన్ తెందుల్కర్, ఒలింపిక్ స్వర్ణ పతక షూటర్ అభినవ్ బింద్రా అభినందనలు తెలిపారు.

48 బంతుల్లో 135 పరుగులు

ఆర్సీబీ కెప్టెన్ రజత్ పాటిదార్ వీరవిహారం!



రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) కెప్టెన్ రజత్ పాటిదార్ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ఆకాశమే హద్దుగా చెలరేగి అద్భుతమైన ఇన్నింగ్స్‌తో చరిత్ర సృష్టించాడు. మధ్యప్రదేశ్ జట్టుకు సారథ్యం వహిస్తున్న రజత్ పాటిదార్, అస్సాంతో జరిగిన మ్యాచ్‌లో కేవలం 48 బంతుల్లోనే 8 ఫోర్లు, 13 భారీ సిక్సర్లతో 135 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. 281.25 విధ్వంసకర స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేసిన పాటిదార్, కేవలం 41 బంతుల్లోనే తన సెంచరీని పూర్తి చేసుకున్నాడు. న్యూ చండీగఢ్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో మధ్యప్రదేశ్ జట్టు 57 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ క్లిష్ట సమయంలో ఐదో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన రజత్ పాటిదార్, అస్సాం బౌలర్లపై విరుచుకుపడ్డాడు. మైదానం నలుమూలలా బౌండరీలు, సిక్సర్ల వర్షం కురిపిస్తూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. పాటిదార్ మెరుపు బ్యాటింగ్ కారణంగా మధ్యప్రదేశ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 250 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఈ సెంచరీతో రజత్ పాటిదార్ తన పాత రికార్డును తానే బద్దలు కొట్టాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ చరిత్రలో మధ్యప్రదేశ్ తరఫున సెంచరీ సాధించిన తొలి బ్యాటర్‌గా రజత్ అరుదైన రికార్డు నెలకొల్పాడు. గతంలో 2021లో గోవాపై 96 పరుగులు, 2022లో రైల్వేస్‌పై 92 పరుగులు చేసి త్రుటిలో సెంచరీలను చేజార్చుకున్న పాటిదార్, ఇప్పుడు మూడంకెల స్కోరును దాటి ఆ లోటును భర్తీ చేసుకున్నాడు. కాగా, ఇటీవల ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ వన్డే టోర్నమెంట్‌కు ఎంపికైనప్పటికీ, 50 ఓవర్ల క్రికెట్ ఆడేందుకు తన శరీరం పూర్తిగా సహకరించడం లేదని, అందుకే కేవలం టీ20 క్రికెట్‌పైనే దృష్టి పెడుతున్నానని స్పష్టం చేస్తూ పాటిదార్ ఆ టోర్నీ నుంచి తప్పుకున్నాడు. తాజా తుఫాన్ ఇన్నింగ్స్‌తో టీ20 ఫార్మాట్‌లో తాను ఎంత ప్రమాదకరమైన ఆటగాడో పాటిదార్ మరోసారి నిరూపించుకున్నాడు.



వజ్రాల ఆభరణాలలో అబ్బురపరిచిన రకుల్ ప్రీత్ సింగ్

'రంగస్థలం' చిట్టి బాబును..'పుష్ప' పుష్పరాజ్‌ను మించేలా..!



సుకుమార్ తెరకెక్కించిన రంగస్థలం, పుష్ప చిత్రాల్లో హీరోల పాత్రల రూపురేఖలను పూర్తిగా మార్చేశారు. ఇప్పుడు =జ17లో రామ్ చరణ్‌ను ఎలా చూపించబోతున్నారనే ఆసక్తి పెరుగుతోంది. ప్రీ లుక్‌లోని నెమలి పింఛం ఆధారంగా చరణ్ పాత్రపై రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. చిట్టిబాబు, పుష్పరాజ్‌లను మించే క్యారెక్టరైజేషన్ ఉంటుందని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు.

పాన్ ఇండియా రేసింగ్ లో దర్శకుడు సుకుమార్ స్థానం ఇప్పుడు ఎక్కడ ఉందో తెలిసిందే. పుష్ప, పుష్ప 2 చిత్రాలతో రూ.2000 కోట్ల వసూళ్ల క్లబ్ ని అందుకున్నాడు సుక్కూ. భారతదేశంలో దిగ్గజ దర్శకులుగా చెప్పుకునే చాలా మంది స్టార్ డైరెక్టర్లు ఈ ఫీట్ ని ఇంకా సాధించలేదు. రాజమౌళి, నితీష్ తివారీ లాంటి వారికి ఇలాంటి అరుదైన అవకాశం లభించింది.అందుకే ఇప్పుడు సుకుమార్ తెరకెక్కించే సినిమాపై ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాలున్నాయి. ముఖ్యంగా ఉత్తరాది ట్రేడ్ లోను సుక్కూ తన తదుపరి చిత్రంలో కథానాయకుడిని ఎలా చూపించబోతున్నాడు? అన్నది ఆసక్తిగా పరిశీలిస్తున్నారు. అతడు పాత్రలను సరికొత్తగా తీర్చిదిద్దే విధానం అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. రంగస్థలంలో చెవులు వినిపించని(చెవిటి) చిట్టి బాబును.. పుష్పలో గూని వంచే ఊరమాస్ పుష్పరాజ్ ని చూపించిన సుకుమార్ ఆ రెండు పాత్రల ఆహార్యాన్ని అంతకుముందు ఎన్నడూ చూడని విధంగా చూపించారు. సుక్కూ ఎంపిక చేసుకున్న పాత్రలు ఎంతో రియలిస్టిక్ గా, నేచురల్ గా, ప్రజలు రెగ్యులర్ గా చూసేవిగా కనిపిస్తూనే, గమ్మత్తయిన ఆహార్యంతో అలరించాయి.రంగస్థలంలో గోదారి కుర్రాడిగా చరణ్‌ను చూపించిన తీరును ఇప్పటికీ మర్చిపోలేరు. ఇక గంధపు చెక్కల స్మగ్లర్ గా అల్లు అర్జున్ లాంటి స్టైలిష్ స్టార్ ని అతడు పెద్ద తెరపై ఆవిష్కరించిన తీరు గురించి చాలా చర్చ సాగుతూనే ఉంది. టాలీవుడ్ కి ఉత్తమ నటుడిగా మొదటి జాతీయ అవార్డ్ తేగలిగిన ప్రతిభ సుకుమార్ సొంతం.అందుకే ఇప్పుడు రామ్ చరణ్ ని ఆర్.సి 17లో ఎలా చూపింబోతున్నాడు? అన్నది ఆసక్తిగా మారింది. రంగస్థలం లో చిట్టిబాబు పాత్రతో చరణ్ ని అంతకుముందు ఉన్న ఇమేజ్ చట్రం నుంచి బయటకు తెచ్చాడు. కేవలం మాస్ యాక్షన్ హీరోగానే కాదు.. నటుడిగాను అతడిలోని బెస్ట్ ఏంటో చూపించాడు. చిట్టిబాబుగా చరణ్ నటనకు జాతీయ అవార్డ్ రావాల్సింది. రకరకాల కారణాలతో పురస్కారం దక్కలేదనే చర్చ తెలుగు మీడియాలో ఇప్పటికీ సాగుతూనే ఉంది. అందుకే ఇప్పుడు ఆర్.సి 17లో చరణ్ ని సుక్కూ ఎలా చూపించబోతున్నారు? అన్న చర్చ అంతకంతకు వేడెక్కిస్తోంది.

ఇప్పటివరకు =జ17లో చరణ్ పాత్రకు సంబంధించి చిన్న లీక్ కూడా బయటకు రాకుండా సుకుమార్ పూర్తి జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అయితే గతంలో విడుదల చేసిన ప్రీ-లుక్ పోస్టర్‌లో కనిపించిన నెమలి పింఛం ఆధారంగా చరణ్ ఈ సినిమాలో గోపీ కృష్ణుడు లేదా ఒక భిన్నమైన రెబెల్ షేడ్ ఉన్న క్యారెక్టర్‌లో కనిపిస్తాడనే ప్రచారం గట్టిగా జరుగుతోంది. చిట్టిబాబును, పుష్పరాజ్ ను దాటుకుని వెళ్లే స్థాయి క్యారెక్టరైజేషన్ డిజైన్ చేయడం సుకుమార్‌కు పెద్ద సవాలే అయినా.. అతడి మార్క్ మేకింగ్ తప్పకుండా మరో బిగ్గెస్ట్ విజువల్ ట్రీట్‌ని ఇస్తుందని ఫ్యాన్స్ ధీమాగా ఉన్నారు. ముఖ్యంగా రామ్ చరణ్ తన కెరీర్ లో మర్చిపోలేని మరో అద్భుతమైన పాత్రలో నటిస్తున్నాడని అభిమానులు అంచనా వేస్తున్నారు. ఆర్.సి 17 నుంచి చరణ్ లుక్ విడుదలైతే కానీ ఈ పాత్ర ఎలాంటిదో ఇంకా ఊహించలేము.

దీపావళి వేడుకల్లో మెరిసిపోయిన సోఫీ చౌధ్రి -- ఆకర్షణీయమైన సీక్విన్డ్ చీరలో మెరిసిన తార

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com